


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 20-08-2019 | VIJAYABHANU DAILY ⋆ VISAKHAPATNAM | సంపుటి : 42 సంచిక : 296 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# జగన్ పాలనపై జనంబాట



అమరావతి/హైదరాబాద్ : ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఏపి రాజకీయాల్లో దూకుడు పెంచబోతున్నారు. పాలన చేపట్టి వంద రోజులు సమీపిస్తున్న వైసీపి ప్రభుత్వం పట్ల క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎలా భావిస్తున్నారో తెలుసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తున్నారు. నవరత్నాల గురించి, వృద్యాప్య పించన్ గురించి, ప్రభుత్వ పథకాల గురించి, ఇటీవల ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయమైన కరకట్ట భవంతుల కూల్చివేతల గురించి ప్రజల రియాక్షన్‌ను నేరుగా తెలుసుకునేందకు నడుంబిగిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందుకోసం అదికారులు తగిన రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

**జగన్ మళ్లీ జనం బాట..!**

**ప్రభుత్వ పనితీరు తెలుసుకోవడంపై ఫోకస్..!!**

ఏపి యువ సీఎం జగన్ మోహన్ రెడ్డి మళ్లీ జనం బాట పట్టబోతున్నారు. వచ్చేనెల నుండి ప్రభుత్వ పథకాలు, పాలన, ప్రజా సమస్యలు, అదికారుల పని తీరు తదితర అంశాలు నేరుగా ప్రజలతో మమేకమై వారి స్పందన తెలుసుకునేందుకు పథకం రూపొందిస్తున్నారు. గతంలో పాద యాత్రలో ఇచ్చిన హామీలతో పాటు మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాల అమలు ఎలా జరుగుతుందో ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు జగన్. కొన్ని సందర్భాల్లో అదికారులు ప్రభుత్వ యంత్రాంగాన్ని తరువాయి 2లో..

## 100 రోజుల పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ

## చంద్రన్న.. కాదుకాదు.. వైఎస్ఆర్ 'పెళ్లికానుక'

### పథకాలు అవే.. పేర్లు మార్పు.. అంతే..

అమరావతి: పథకాల పేర్లు మార్పులో ఏపీ ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. తెదేపా హయాంలో ప్రవేశపెట్టిన చంద్రన్న పెళ్లి కానుక పథకం పేరును మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ఈ పథకాన్ని వైఎస్సార్ పెళ్లికానుకగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాల పేర్లను మారుస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తరువాయి 2లో..

## జైట్లీ ఆరోగ్యం విషమం

### అత్యవసర చికిత్సపై అద్వానీ ఆరా



దిల్లీ: తీవ్ర అనారోగ్యంతో ఎయిమ్స్‌లో చికిత్సపొందుతున్న కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీని భాజపా అగ్రనేత ఎల్‌కే ఆడ్వాణీ పరామర్శించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన దిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి చేరుకొని జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అరుణ్ జైట్లీ ఆరోగ్యం విషమించడంతో ఆయనను ప్రాణాధార వ్యవస్థపై ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు రాజకీయ తరువాయి 2లో..

## ఏపీలో ముగ్గురు ఎమ్మెల్సీల ఎన్నిక ఏకగ్రీవం

### మోపిదేవి వెంకట రమణ, మహ్మద్ ఇక్బాల్, చల్లా రామకృష్ణారెడ్డి



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు ఎమ్మెల్సీల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎమ్మెల్యే కోటాలో ఖాళీగా ఉన్న మూడు స్థానాలకు.. వైఎస్సార్ కాంగ్రెస్ తరపున రాష్ట్ర మంత్రిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, మైనార్టీ నేత మహ్మద్ ఇక్బాల్, కర్నూలు జిల్లాకు చెందిన సీనియర్ నేత చల్లా రామకృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఈ ముగ్గురు ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి సోమవారం ప్రకటించారు. అనంతరం మహ్మద్ ఇక్బాల్, చల్లా రామకృష్ణారెడ్డి ఎమ్మెల్సీలుగా ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు. కాగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి స్థాయిలో మెజారిటీ ఉండటంతో.. తరువాయి 2లో..

## బీహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా కన్నుమూత



న్యూఢిల్లీ: బీహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా(82) అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కొద్దిరోజులుగా ఆయనకు వైద్యులు చికిత్సనందించారు. 2018లో మిశ్రా భార్య వీణా(72) అనారోగ్య కారణంగా చనిపోయారు. కాంగ్రెస్‌లో మిశ్రా సుదీర్ఘ కాలం కీలక నేతగా కొనసాగారు. తరువాయి 2లో..

## రాజ్యసభకు మన్మోహన్ ఏకగ్రీవం



జైపూర్: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ ఉపసంహరణకు గడువు ముగియడంతో మన్మోహన్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు.

మన్మోహన్ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఓ ట్వీట్‌లో అభినందనలు తెలిపారు. 'ఏకగ్రీవంగా ఎన్నికైన మన్మోహన్‌జీకి తరువాయి 2లో..

## ఎయిరిండియా కేసులో చిదంబరానికి సమన్లు



దిల్లీ: యూపీఏ హయాంలో ఎయిర్ ఇండియాకు నష్టం వాటిల్లేందుకు కారణమైన భారీ కుంభకోణం, నగదు అక్రమ చలామణీ కేసులో కేసులో ఆర్థికశాఖ మాజీ మంత్రి పి. చిదంబరంకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసింది. ఈ కేసులో దర్యాప్తు నిమిత్తం ఆగస్టు 23న అధికారుల ఎదుట హాజరు కావాలని ఈడీ ఆదేశించింది.

2008-09 మధ్య కాలంలో విదేశీ ప్రయివేటు విమాన సంస్థలైన ఎమిరేట్స్, ఎయిర్‌అరేబియా, ఖతార్‌లకు ఎయిర్ స్లాట్స్ కేటాయించడంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయి. ఈ కుంభకోణం కారణంగా దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియాకు భారీగా నష్టం వాటిల్లినట్లు ఆరోపణలు రావడంతో దర్యాప్తు అధికారులు మనీలాండరింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కుంభకోణం సమయంలో ప్రఫుల్ పటేల్ తరువాయి 2లో..

## అధికారుల సమన్వయంతో వరదనీటిని అదుపుచేశాం

- వరద అంచనా కోసమే డ్రోన్
- కమ్యూనికేషన్ గ్యాప్.. రాద్ధాంతం వద్దు
- డీజీపీ గౌతమ్ సవాంగ్



విజయవాడ: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపై డ్రోన్ ఎగురవేసిన వివాదం ఏపీ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యవహారంపై టీడీపీ అధినేత మొదలుకుని నేతలు స్పందిస్తూ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా డీజీపీ గౌతమ్ సవాంగ్ క్లారిటీ ఇచ్చారు. వరదల కారణంగా అంచనా కోసం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డ్రోన్ ఉపయోగించిందని స్పష్టం చేశారు.

అయితే.. లోకల్ పోలీసులకు సమాచారం లేకపోవడంతో కమ్యునికేషన్ తరువాయి 2లో..

## 51ఏళ్ల క్రితం గల్లంతైన విమాన శకలాలు లభ్యం



వార్త 8వ పేజీలో..




## శాంతించిన కృష్ణమ్మ

### శ్రీశైలంలో తగ్గుముఖంపట్టిన వరద

### ఇదే క్రమంలో నాగార్జునసాగర్



శ్రీశైలం: కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కృష్ణానదికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. జూరాల జలాశయం ఇన్‌ఫ్లో 3.54 లక్షల క్యూసెక్కులుకాగా.. 21 గేట్లద్వారా 3.39 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 8.434 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 317.910 మీటర్లకుగానూ.. ప్రస్తుతం 213.516 మీటర్లుగా ఉంది.

శ్రీశైలం జలాశయనికీ వరద క్రమంగా తగ్గుతోంది. ఇన్‌ఫ్లో 4.65 తరువాయి 2లో..

## మన్యంలో ఎదురుకాల్పులు



సీలేరు: విశాఖ జిల్లాలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. జీకే వీధి-కొయ్యూరు మండలాల సరిహద్దులోని యు.చీడిపాలెం పంచాయతీ మండపల్లి అటవీ ప్రాంతంలో కాల్పులు జరిగినట్లు తెలిసింది. మావోయిస్టు అగ్రనేత చలపతి ఆధ్వర్యంలో సుమారు 20 మంది మండపల్లి అటవీ ప్రాంతంలో సమావేశమవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెద్ద ఎత్తున గ్రేహౌండ్స్, ప్రత్యేక పార్టీ పోలీసులు జీకే వీధి, కొయ్యూరు మండలాల సరిహద్దుల్లో మోహరించారు. సోమవారం మధ్యాహ్నం మండపల్లి అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టిన పోలీసులకు మావోయిస్టులు తారసపడ్డారు. తరువాయి 2లో..

# నేరాల అదుపునకు చర్యలు

## నర్సీపట్నం ఏఎస్పీ రిషాంత్‌రెడ్డి



కోటవురట్ల : నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నర్సీపట్నం ఏఎస్పీ రిషాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఆయన కోటవురట్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా రావడంతో డివిజన్‌లోని ప్రధాన సమస్యలు తెలుసుకుంటున్నానని చెప్పారు. ముఖ్యంగా గంజాయి రవాణా, మావో యిస్టుల ప్రభావం, రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు.

ఇక్కడ రాజకీయ ఒత్తిడి లేదని, ఈ ప్రాంతంలో ప్రశాంతమైన వాతావరణం కలిగి ఉందన్నారు. అనంతరం రికా ర్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆయనతో పాటు ఎస్సై మధు సూధన రావు తెలిపారు.

# పుస్తకాలు పంపిణీ



భీమునిపట్నం: స్థానిక ఆదర్శ హిందీ ప్రేమి మండలి విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఇరవై వేలు విలువగల పుస్తకాలను పంపిణీ చేశారు. హిందీలో ఉన్న వివిధ జాతీయ నాయకుల చరిత్రలకు సంబందించిన పుస్తకాలను, గైడ్లను భీమిలి డివిజన్ కమిటీ అధ్యక్షులు, ఆదర్శ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు గంటా నూకరాజు అందజేశారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ ఆదర్శ హిందీ ప్రేమిమండలి ద్వారా ఎంతోమంది విద్యార్థులకు మన జాతీయభాష అయిన హిందీ పట్ల మక్కువ కలిగేవిధంగా హిందీ భాష యొక్క ప్రాముఖ్యతను గురించి విద్యార్థిని విద్యార్థులు సుముఖత వ్యక్తం చేసి నేర్చు కోవడానికి ముందుకు వచ్చేవిధంగా ప్రోత్స హిస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్.కృష్ణారావును ప్రత్యే కంగా అభినందించాల్సిన అవసర ముందని, కానీ నాకంటే వయసులో పెద్ద కావడం వలన ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. భారతదేశం మొత్తం మీద ఏ ప్రాంతానికయినా, ఏ రాష్ట్రానికైనా దైర్యంగా వెళ్లి రావచ్చని, జాతీయ భాష కావ డంతో ప్రతీ రాష్ట్రంలో హిందీ మాట్లాడేవారు చాలామంది ఉంటారని తెలిపారు. ఎవరైనా పదవీవిరమణ చేసిన తరువాత విశ్రాంతి తీసుకోవాలని అనుకుంటారని కానీ కృష్ణారావు మాస్టర్ ఎక్కువమంది పిల్లలకు హిందీ పట్ల మక్కువ కలిగేవిధంగా చేసి, పిల్లలకు అవస రమైన పుస్తకాలను, అవసరమైన నియమాలను ఆయనే దగ్గరుండి చూసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చురకల రమణ, పి.శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్పందన కార్యక్రమానికి 1835 అర్జీలు



విశాఖపట్నం : కలక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనపై పెద్ద ఎత్తున అర్జీ దారులు వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్నారు. స్పందన కార్యక్రమానికి 1835 అర్జీలు వచ్చాయి. వారిలో ఎక్కువ మంది రేషన్ కార్డులు, ఫించన్లు, ఇళ్లను గూర్చి ధరఖాస్తులు సమర్పించారు. అంతే కాకుండా భూ సమస్యలు, వ్యవసాయం, ఉపాధి, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ వి. వినయ్‌చంద్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎల్.శివ శంకర్, ట్రైనీ కలెక్టర్ ప్రతిష్ట, జాయింట్ కలెక్టర్-2 ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీదేవి లు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఎ.శ్రీనివాసరావు, స్పందన పర్యవేక్షకులు నాగరాజు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో లక్ష్మీగణపతి హెూమం



చోడవరం : పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో శ్రావణబహుళ చవితి సంకట చతుర్థి సందర్భంగా లక్ష్మీగణపతి హెూమ పూజ కార్యక్రమాన్ని సోమవారం భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్, అర్చకులు చలపతిరావు, పురోహితులు దవళ ప్రసాద్ ఆధ్వర్యంలో సామూహిక హెూమ పూజ నిర్వహించారు. అనంతరం కార్యసిద్ది విఘ్నేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖకార్య నిర్వహణాధికారి యస్.వి. వి.సత్యనారాయణ మూర్తి, బాల గణపతి సంఘం సభ్యులు పప్పల జయదేవ్, నాగిరెడ్డి, ఎస్.వి. మధు, జ్యోతుల గోపి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 27బస్తాల కోటా బియ్యం పట్టివేత

యలమంచిలి రూరల్ : యలమంచిలి ఆర్టీసి కాంప్లెక్స్ సమీపంలో ఆటోలో తరలిస్తున్న 27 బస్తాల కోటా బియ్యాన్ని పట్టుకున్నామని టౌన్ ఎస్సై నాగకార్తీక్ తెలిపారు. తుని నుంచి యలమంచిలి వచ్చిన ఈ బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. ఆటోతో సహా బియ్యాన్ని సీజ్ చేసి స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు.

# కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



భీమునిపట్నం: స్థానిక చిన్నబజార్. డచ్ రోడ్డు లో ఉన్న కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరంను ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యులు డా. జగన్నాథ రావు, మోహన రావులు సుమారు 200 మంది రోగులని పరీ క్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో కె.శ్రీనివాస రావు, శంకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరూ అక్షరాస్యత కలిగి ఉండాలి



అనంతగిరి రూరల్ : ఆర్థికఅక్షరాస్యత కలిగి ఉన్ననాడే ప్రతీ ఒక్కరు మెరుగైన జీవితం అనుభవిస్తారని ఎస్‌బిఐ ఫైనాన్స్ ఇన్‌క్లూసన్ అధికారులు బ్రహ్మనందం,రాఘవులు, ఎల్.హెచ్.ఓ శ్రీనివాసరావు అన్నారు. ప్రతీ ఒక్కరు తక్కువ ప్రీమియం చెల్లించి ధీమాగాఉండాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటల్ పెంక్షన్ యోజన, అలాగే ఎసిబి ఐ లో ఇతర ఇన్సూరెన్స్ స్కీములు లో చేరి కుటుంబానికి భద్రతగా నిలవాలని కోరారు.మండలం లోని కసిపట్నం పంచాయతీ కేంద్రం లో గలా బిసి పోయింట్ ను సోమవారం సందర్శించి సంత ృప్తి వ్యక్తం చేశారు.ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడం తో పాటు వారికి సోషల్ షెడ్యూల్ స్కీములు పరిచయం చేసి వారి ఆర్థిక పురోభివృద్ధి కి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిబి ఐ సిబ్బంది రమణారావు, స్థానిక బిసి పోయింట్ నిర్వాహకులు, సంజీవ్, ప్రశాంతి పాల్గొన్నారు.

# శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణలక్ష్మీపూజలు



విశాఖపట్నం : శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణలక్ష్మి పూజలు ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, ఆంధ్రుల ఆరాధ్యదైవం, సౌభాగ్య ప్రదాయిని అయిన విశాఖ నగరంలో గల శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం' సందర్భంగా శ్రీ లక్ష్మి పూజలు ప్రారంభించి 18వ రోజుకు చేరినవి. ఉదయం 8.00 గం.లకు వేద మంత్రముల మధ్య నాదస్వర సుస్వరాలు మధ్య శ్రీ లక్ష్మీ పూజలు ప్రారంభించారు. మొత్తం 42 మంది ఉభయదాతలు స్వయంగా పాల్గొన్నారు. పోస్టల్ ద్వారా భక్తుల పేరున పూజ నిర్వహించి వారి ప్రసాదములు పంపుట జరిగినది. ఈ పూజకు కావలసిన పూజా సామాగ్రి దేవస్థానం వారే సమకూర్చేదరు. పూజ రుసుము రూ. 400/-.ఈ కార్యక్రమంలో ఎన్.వి.ఎస్.ఎన్. మూర్తి, సహాయ కార్యనిర్వహణాధికారి వి.రాంబాబు, పర్యవేక్షకులు రాజు, ఏ. త్రిమూ ర్తులు, వేదపండితులు పాల్గొన్నారు.

# భీమవరం పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

- ఆసుపత్రి ప్రసవాలు పెంచండి
- మలేరియా జ్వరాలు నమోదైన గ్రామములో ఫోకల్ స్ప్రే
- పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి డి.కె.బాలాజీ



భీమవరం పిహెచ్‌సిలో రికార్డులు పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి డి.కె.బాలాజీ

అనంతగిరి : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి డి.కె.బాలాజీ మండలంలోని భీమవరం ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి రిజిస్టర్లు తనిఖీ చేశారు. మలేరియా నమోదైన కేసులు పరిశీలించారు. జ్వరాలు నమోదైన గ్రామాల్లో ఫోకల్ స్ప్రయింగ్ చేయించాలని ఆదేశించారు.

ఆసుపత్రిలో ప్రసవించే గర్భిణీలకు భోజన సదుపాయాలు కల్పించడానికి ప్రతి పిహెచ్ సి కి రూ.15 వేలు నిధులు మంజూరు చేసామని చెప్పారు. వాటిని సక్రమంగా వినియోగించాలని ఆదేశించారు. హై రిస్క్ గర్భిణీ స్త్రీల ఆరోగ్యం పై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పూర్తి స్తాయిలో మందుల నిల్వలు అందుబాటులో ఉంచాలన్నారు. పాముకాటు మందుల పై ఆరా తీశారు. అంతకు ముందు భీంపోలు పంచాయతీ చిమిడిపల్లి ప్రాథమిక పాఠశాలని తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి అసంత ృప్తి వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడు పాఠశాలకు ఆల స్యంగా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు కనీసం కూడికలు తీసివేతలు చేయలేక పోతున్నారని ఉపాధ్యాయుడు పై చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. నెలరోజుల తరువాత వస్తానని మార్పు రాకపోతే పదవి విరమణ ప్రయో జనాలు నిలుపుదల చేస్తామన్నారు. పాఠశాల భవనం మరమ్మతులు చేయాలని కోరగా సాను కూలంగా స్పందించారు. మరమ్మతులుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమ ఇంజనీరులను ఆదేశించారు.

గ్రామానికి గ్రావిటి పథకం మంజూరు చేశారు. గ్రామంలో పర్యటించారు. జ్వరాలు, దోమలమందు పిచికారీ పనులు పై ఆరాతీశారు.

మొదటి పేజీ తరువాయి

## జైట్లీ ఆరోగ్యం విషమం

ప్రముఖులు ఆస్పత్రికి వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను ఆరా తీస్తున్నారు. శ్వాస సంబంధ ఇబ్బంది రావడంతో అరుణ్ జైట్లీని ఈ నెల 9న కుటుంబ సభ్యులు ఎయిమ్స్‌లో చేర్పించిన విషయం తెలిసిందే.

ఇప్పటికే జైట్లీకి డయాలిసిస్ చికిత్స అందిస్తున్న వైద్యుల బృందం ఆదివారం సాయంత్రం ఆయనను గుండె, శ్వాస వ్యవస్థలకు తోడ్పాటు అందించే ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (ఈసీఎంవో) వ్యవస్థపై ఉంచారు. నిన్న కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతీ ఇరాని, జితేంద్రసింగ్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తదితరులు వచ్చి జైట్లీ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 10నుంచి ఇప్పటివరకు ఎయిమ్స్ వైద్యులు అరుణ్ జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటెన్ విడుదల చేయలేదు.ం

## ఏపీలో ముగ్గురు ఎమ్మెల్సీల ఎన్నిక ఏకగ్రీవం

ప్రతిపక్ష టీడీపీ నుంచి ఎవరు బరిలో నిలువలేదు. కాగా, ఆగస్టు 14వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించిన ఎన్నికల సంఘం.. 16వ తేదీన నామినేషన్ల పరిశీలన జరిపింది. నేడు నామినేషన్ల ఉపసంహరణ తుది గడవు ముగియడంతో.. బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలుపొందినట్టు ప్రకటించింది.

## బీహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా కన్నుమూత

బీహార్ 14వ ముఖ్యమంత్రిగా ఆయన పనిచేశారు. కేంద్ర మంత్రిగా కూడా మిశ్రా సేవలందించారు. కాంగ్రెస్‌ను వీడిన తర్వాత ఆయన జేడీయూలో చేరారు. సెప్టెంబర్ 30, 2013లో దాణా కుంభకోణంలో సీబీఐ కోర్టు మిశ్రాకు నాలుగేళ్ల జైలు శిక్ష, 2లక్షల జరిమానా విధించింది. జులై 20, 2018న జార్ఖండ్ హైకోర్టు మిశ్రాకు బెయిల్ మంజూరు చేసింది.

## రాజ్యసభకు మన్మోహన్ ఏకగ్రీవం

నా అభినందనలు. ఆయన ఎన్నిక రాష్ట్రానికే గర్వకారణం. ఆయనకున్న అపార జ్ఞానం, అనుభవం రాజస్థాన్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది' అని గెహ్లాట్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. రాజ్యస్థాన్ నుంచి రాజ్యసభ ఉపఎన్నికకు మన్మోహన్‌ను తమ అభ్యర్థిగా కాంగ్రెస్ నిలబెట్టగా, బీజేపీ ఎవరినీ బరిలోకి దింపలేదు. రాజ్యసభ ఎంపీ మదన్ లాల్ షైనీ ఇటీవల మృతి చెందడంతో ఈ సీటుకు ఉపఎన్నిక జరిగింది.

## అధికారుల సమన్వయంతో వరదనీటిని అదుపుచేశాం

గ్యాప్ వచ్చిందన్నారు. ఇందులో ఎటువంటి కుట్రా లేదన్నారు. దీనిని రాజకీయం చేయవద్దని.. ఇకపై ఎవరైనా డ్రోన్ ఉపయోగించాలంటే స్థానిక పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. ఇరిగేషన్ అధికారులకు, స్థానిక పోలీసులకు మధ్య సమన్వయం లేని కారణంగా ఈ వివాదం నెలకొందని డీజీపీ సవాంగ్ తెలిపారు.

## ఎయిరిండియా కేసులో చిదంబరానికి సమన్లు

విమానయానశాఖ మంత్రిగా ఉండగా.. చిదంబరం ఆర్థికమంత్రిగా పనిచేశారు. ఇప్పటికే ఈ కేసులో ప్రఫుల్ పటేల్‌ను ఈడీ ప్రశ్నించింది. తాజాగా చిదంబరంకు కూడా సమన్లు జారీ చేశారు. మరోవైపు ఐఎన్ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసుల్లోనూ చిదంబరం ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

## శాంతించిన కృష్ణమ్మ

లక్షల క్యూసెక్కులు కాగా.. ఔట్‌ఫ్లో 3.79 లక్షలుగా నమోదైంది. జలాశయపూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులుకాగా.. ప్రస్తుత నీటిమట్టం 882.30 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 215.81 టీఎంసీలకుగానూ.. ప్రస్తుతం 200.65 టీఎంసీల నీరు ఉంది. కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 30,931 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 42వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 2,400 క్యూసెక్కులు, హంద్రీనీవాకు 2,026 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 34 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం 10 గేట్లను పైకెత్తి 2,68,717 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

మరోవైపు నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం భారీగా తగ్గింది. జలాశయానికి 3.19 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. అంతేమొత్తాన్ని దిగువకు వదులుతున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 586.50 అడుగులుగా ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటినిల్వ 312 టీఎంసీలకుగానూ.. ప్రస్తుతం 302.91 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ 26 గేట్లను ఎత్తి 2.66 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## మన్యంలో ఎదురుకాల్పులు

ఈ క్రమంలో హెచ్చరికలు చేస్తున్నప్పటికీ మావోయిస్టులు కాల్పులు జరపడంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపినట్లు సమాచారం. దీంతో సుమారు 45 నిమిషాల పాటు ఇరు వర్గాల మధ్య కాల్పులు జరిగినట్టు తెలిసింది. కాల్పులు జరిగిన విషయాన్ని విశాఖ గ్రామీణ ఎస్పీ అట్టాడ బాబూజీ ధ్రువీకరించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జగన్ పాలనపై జనంబాట

తప్పుదోవ పట్టించే అవకాశాలు ఉన్నందున అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా జగన్ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

వంద రోజుల జగన్ పాలన.. ప్రజాభిప్రాయం తెలుసుకోనున్న యువ సీఎం.. అందుకోసం పకడ్బందీగా అడుగులు వేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. పాలన పట్ల ప్రజల అభిప్రాయం ఏంటో తెలుసుకునేందుకు మధ్యవర్తులపైన ఆధార పడకుండా నేరుగా ప్రజలతోనే తెలుసుకోవాలని ప్రణాళికలు రచిస్తున్నారు. అమెరికా పర్యటన ముగిసిన వెంటనే ఈ కార్యక్రమంపై తుది కసరత్తు ఉంటుందని తెలుస్తోంది. అధికారులు ఈ మేరకు ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి జగన్ ఆమోదం తెలిపిన తర్వాత కార్యక్రమం ముందుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మళ్లీ ప్రజలతో మమేకం..! ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు..!! ఏపి సీఎం వైయస్ జగన్‌మోహన్ రెడ్డి సెప్టెంబర్ నెల నుండి ప్రజలతో మమేకమై మరింత దూకుడు పెంచనున్నారు. వచ్చే నెల నుండి జిల్లా పర్యటనలతో పాటు తమ మేనిఫెస్టోలోని అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం అధికార యంత్రాంగంతోపాటు పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలు ఇప్పటికే అందాయి. ముఖ్యమంత్రిగా బాధ్య తలు స్వీకరించిన తరువాత జగన్ అన్ని శాఖల సమీక్షలు నిర్వహించారు. వాటిలోని లోటు పాట్లను పరిశీలించారు. దాదాపు మూడు నెలల నుండి జగన్ తాడేపల్లి లోని తన క్యాంపు కార్యాలయం నుండే ఈ సమీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు.

13 జిల్లాల్లో పర్యటనలు..! ప్రజలవద్దకే మళ్లీ ప్రజా నాయకుడు..!! అయితే, రానున్న సెప్టెంబర్ నుండి ఇక జనంలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. తన విధనాలను నేరుగా ప్రజలకు వివరించేందుకు సన్నాహాలు చేసుకుంటు న్నారు. సెప్టెంబర్‌లో రచ్చబండ పేరిట రాష్ట్రంలోని 13 జిల్లాల్లో సీఎం జగన్ పర్య టించనున్నారు. ఈమేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు అందినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కార్యక్రమం సెప్టెంబరు 2న చిత్తూరు జిల్లా నుండి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. సీఎం జిల్లాల పర్యటనలకు వెళ్లే లోగా కొన్ని కార్యక్రమాలను అమలు చేసే పనిలో మంత్రులు, అధికార యంత్రాంగం ఉన్నట్టు తెలుస్తోంది.

## చంద్రన్న.. కాదుకాదు.. వైఎస్ఆర్ 'పెళ్లికానుక'

నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పథకం పేరును వైఎస్సార్ పింఛను కానుకగా, మధ్యాహ్న భోజన పథకం పేరును వైఎస్సార్ అక్షయపాత్రగా మార్చారు.

# బాబు ఇంటిని ముంచాలనే ఆలోచన లేదు

అమరావతి: 2009 తర్వాత రాష్ట్రంలో ఇంత భారీ స్థాయిలో ఎప్పుడూ వరదలు రాలేదని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ చెప్పారు. గరిష్ఠంగా 8.05లక్షల క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజ్ నుంచి వదిలినట్లు చెప్పారు. ఎక్కడికక్కడ సమన్వయం చేసుకుంటూ సరైన సమయంలోనే వరదనీటిని దిగువకు వదిలామన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెదేపా అధినేత చంద్రబాబు ఉంటున్న ఇంటిని ముంచాలనే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. వరదపై తెదేపా నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాయలసీమకు నీరివ్వడంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని చెప్పారు. అధికారులతో సమీక్షలు చేయడం ఒక్కటే తమ బాధ్యత కాదని.. క్షేత్రస్థాయిలో ప్రజల బాగోగులనూ పట్టించుకోవాల్సి ఉంటుందని అనిల్ వ్యాఖ్యానించారు. తెదేపా నేతలు లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

# రాష్ట్రవ్యాప్తంగా స్ట్రీట్ వెండర్స్‌కు హాకర్‌జోన్స్ నిర్మించి ఇవ్వాలి

## జి.వామనమూర్తి డిమాండ్

విశాఖపట్నంః రాష్ట్రవ్యాప్తంగా వీధి విక్రయదారులకు హాకర్ జోన్స్ నిర్మించి ఇవ్వాలని ఎ.పి. నేషనల్ అసోసియేషన్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ జి.వామనమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

దేశవ్యాప్తంగా కోట్లాదిమంది వీధి విక్రయదారులు ప్రభుత్వాలకు కోట్ల రూపాయలు పన్నుల రూపేణా చెల్లిస్తున్నా వీధి విక్రయదారుల సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. కోట్ల రూపాయలు ప్రభుత్వాలకు పన్నులు చెల్లిస్తున్న వీధి విక్రయదారులకు రాష్ట్రవ్యాప్తంగా హాకరు జోన్లు నిర్మించి ఇవ్వాలని, ముద్రణ లోన్లు మంజూరు చేయాలని వారు కోరారు.

అర్హులైన వీధి విక్రయదారులకు ప్రభుత్వం నిర్మిస్తున్న పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, వారి బ్రతుకు రక్షణకు పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 2019 సెప్టెంబర్ 6, 7 తేదీల్లో ఆల్ ఇండియా ఎజిఎం మీటింగ్ బెంగళూరులో జరగనున్నదని ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా సుమారు 100మంది ప్రతినిధులు పాల్గొనగా, ప్రపంచంలో 10 దేశాలనుండి ప్రతినిధులు హాజరై చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి వారి సమస్యల పరిష్కారం కోసం ఆందోళనా పోరాటాలకు నాంది పలకనున్నారని అన్నారు.

ప్రస్తుతం జివిఎంసి యుసిడి విభాగంలో మెప్మా డిపార్టుమెంట్ ప్రతి చిరు వ్యాపారినుండి రూ.350/-లు తీసుకొని ఫోటో గుర్తింపు కార్డులు, టౌన్ వెండింగ్ సర్టిఫికెట్లు ఇచ్చినప్పటికీ చిరు వ్యాపారులనుండి జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణ పన్నులు వసూళ్లు చేస్తూ ఉంటే మరొకవైపు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లైసెన్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తూవుండగా పోలీస్ వారు ట్రాఫిక్ నిబంధనల పేరుతో తోపుడు బళ్లు, చిరు వ్యాపారులపై విరుచుకుపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా చిల్లర వ్యాపారస్థులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ధాన్ - గీతం సంయుక్తంగా ఉచిత కంటి వైద్య పరీక్షలు



మల్కాపురంః సోమవారం మల్కాపురం కలంజియ సమాఖ్య పరిధిలో 47వ వార్డు పరిధిలో ఉన్న చింతల లోవ కాకర్ల లోవకి చెందిన ప్రజలకు కాకర్ల లోవ కమ్యూనిటీ హాలులోలో గీతం ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ (జి ఐ ఎం ఎస్ ఆర్) ఉదయం నుంచి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. మొదటిసారిగా గీతం హాస్పిటల్ ద్వారా దాన్ ధాన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ క్యాంపు నిర్వహించారు. పేదవారి కాలనీలకు వచ్చి ఇటువంటి ఉచిత స్క్రీనింగ్‌లు నిర్వహించినందుకు గీతం హాస్పిటల్‌కు వందనాలు తెలియజేస్తున్నాము. పొదుపు సంఘాల్లో వున్నపేద మహిళలు ఈ సేవలు ఉపయోగించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గీతం హాస్పిటల్ సిబ్బంది క్యాంపు కోఆర్డినేటర్ ధాన్ పౌండేషన్ హెల్త్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు సమాఖ్య సిబ్బంది కే.మురళీ కృష్ణా రావు పాల్గొన్నారు. జె.నవీన్ కుమార్ ఒఫ్తాల్మజిస్ట్ న్విజన్ టచ్ ఉమ , నూకరత్నం, రమేష్ సమాఖ్య హెల్త్ అసోసియేట్ విజయ, భాగ్యలక్ష్మి, లక్ష్మి కృష్ణవేణి మరియు సమాఖ్య నాయకులు కుమారి, తులసి, వరలక్ష్మి, అనంతలక్ష్మి, లక్ష్మి మొదలైన వారు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాలలో మౌళిక వసతులు కల్పించాలి

## శ్రీకాకుళం జిల్లా కలెక్టరు జె.నివాస్



శ్రీకాకుళం: గ్రామ, వార్డు సచివాలయ పరీక్షా కేంద్రాలలో మౌళిక వసతులను అధికారులు స్వయంగా పరిశీలించాలని జిల్లా కలెక్టరు జె.నివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో స్పందన కార్యక్రమం అనంతరం ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగు దొడ్లు, వైద్యశిభిరాలు తదితర మౌళిక వసతుల ఏర్పాట్లను అధికారులు స్వయంగా పరిశీలించాలన్నారు. జిల్లాలో అమలుచేయనున్న నాణ్యమైన బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ప్రతి క్లష్టరుకు 50 రేషను కార్డులు మ్యాపింగు చేసినప్పటికి కొన్నిచోట్ల 70 కార్డులకు పైగా ఉన్నాయని , మరికొన్ని చోట్ల 20 నుండి 30 కార్డుల మ్యాపింగు జగిరినట్లుగా గుర్తించడం జరిగిందని వాటిని సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పౌర సరఫరాల అధికారులు, తహాశీల్దార్లు మరోసారి మ్యాపింగు వివరాలను పరిశీలించుకోవాలని తెలిపారు. ప్రతి రేషను దుకాణం పరిధిలో 3 వాహనములు అందు బాటులో ఉంటాయని, వాటి ద్వారా వెంటనే సరుకులు పంపిణీ చేయాలని, అవసరమైనన్ని సార్లు వాహనాలు తిరిగి సాధ్యమైనంత త్వరగా పంపిణీ పూర్తిచేయాలని తెలిపారు. రెండు దినాల లోపల పూర్తి పంపిణీ కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని, పంపిణీ కార్యక్రమం సజావుగా సాగుటకు గ్రామ వాలంటీర్లతో ముందుగా సమావేశం నిర్వహించుకోవాలని తహాశీల్దార్లకు సూచించారు.

ఈ సమావేశంలో సంయుక్త కలెక్టరు డా. కె.శ్రీనివాసులు, సహాయ కలెక్టరు ఎ.భార్గవ్ తేజ్, సంయుక్త కలెక్టరు 2 పి.రజనీకాంతరావు, జిల్లా రెవిన్యూ అధికారి కె.నరేంద్ర ప్రసాద్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చెత్తసేకరణ వాహనాల పనితీరును రెగ్యులేట్ చేయండి

- తడిచెత్త-పొడి చెత్తను వేరుచేసి ఇచ్చేలా చూడండి
- 10వ వార్డు కె.ఆర్.యం.కాలనీలో పర్యటన
- పారిశుద్యం పట్ల అసంతృప్తి
- చెత్త సేకరణ మైక్రోపాకెట్ల వారీగా నిర్వహించండి
- విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యంవహిస్తే కఠినచర్యలు
- జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం: చెత్త సేకరణ వాహనాల పనితీరును క్రమబద్ధీకరించాలని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. క్షేత్ర పర్యటన సందర్భంగా సోమవారం పదవవార్డు కె.ఆర్.యం.కాలనీ కాన్వెంట్‌రోడ్‌లో పర్యటించి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మైక్రో పాకెట్ల వారీగా తడి-పొడి చెత్తను వేరుచేసి ఇచ్చేలా చూడాలని ఆదేశించారు. చెత్తను డ్రెయిన్లలో వేయకుండా ప్రజలను చైతన్యవంతం చేయాలని పేర్కొన్నారు. 10వ వార్డు కె.ఆర్.యం.కాలనీలో ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఘనవ్యర్థాల నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సి.యం.ఓ.హెచ్ డా. ఏ.హేమంత్‌ను కోరారు. చెత్త సేకరణ వాహనాల ప్రారంభ - క్లోజింగ్ పాయింట్లలో సమయ పాలన ద్వారా సేకరించేలా చూడాలని పేర్కొన్నారు. వాహనాలకు జిపియస్ అనుసంధానించడం, ప్రైవేటు వాహనాలకు కూడా జిపియస్ అమర్చాలని ఆదేశించారు. యుజిడి లేని చోట యుజిడిని అనుసంధానించి పరిశుభ్రతకు దోహదపడాలని పేర్కొన్నారు. చెత్త సేకరణ, డ్రెయిన్ క్లీనింగ్, పారిశుధ్యంపై పర్యవేక్షణ లోపం, పారిశుధ్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 10వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను మధ్యాహ్నం లోగా పరిశుభ్రం చేసి ఫోటోలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలుతప్పవని హెచ్చరించారు.

పర్యటనలో సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, ఏ.యం.ఓ.హెచ్ డా.యస్.జయరామ, ఇఇ వెంకటి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జోనల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముఠా కార్మికులకు ఉపాధికి రక్షణ కల్పించాలి

## పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్రచట్టం చేయాలి



విశాఖ సిటీః ముఠా కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్రచట్టం చేయాలని, ఉపాధి రక్షణ కల్పించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. విశాఖజిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ జిలా 9వ మహాసభలు ఆగస్టు 18,19 తేదీల్లో జరుగుతున్నాయి. సోమవారం కార్యాలయంలో జరిగిన ప్రతినిధుల సభకు సిహెచ్.నరసింగరావు ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సభనుద్దేశించి సిహెచ్. నరసింగ రావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు నష్టం చేసే విధంగా కార్మికచట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పుచేస్తుందన్నారు. యంత్రాలను ప్రవేశపెట్టడం వల్ల లోడింగ్ అన్‌లోడింగ్ పనులు తగ్గుతున్నాయని, వాల్‌మార్ట్, డీమార్ట్, మోర్, స్పెన్సర్స్, రిలయన్స్ మంది పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్ రావడం వలన చిన్న చిన్న షాపుల యజమానులు కూడా నష్ట పోతారన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఉపాధి రక్షణకోసం ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాడాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ హామాలిస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరించిన ఫలితంగా కార్మికులందరు వైఎస్సార్‌సిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. ముఠా కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిని వెల్ఫేర్‌బోర్డుని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. యూనియన్ ప్రధానకార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు సమగ్రచట్టం చేయాలని, షాపింగ్‌మాల్స్‌లో లోడింగ్ అన్‌లోడింగ్ పనులు కల్పించాలని, వీరి ఉపాధికి రక్షణకల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు టి.పైడిరాజు, ఆర్.నాయుడు, తాతారావు, సింహాచలం అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సభకు ప్రారంభ సూచికగా యూనియన్ గౌరవాధ్యక్షులు వై.రాజు సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 30మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులుగా వై.రాజు, అధ్యక్షులుగా టి.పైడిరాజు, ప్రధానకార్యదర్శిగా ఎం.సుబ్బారావులు తిరిగి ఎన్నికయ్యారు.

# ఉద్యోగభద్రత కల్పించాలి ఆశావర్కర్ల డిమాండ్

విశాఖ సిటీః ఆశా వర్కర్స్‌కు 2019 జనవరి నుండి గౌరవ వేతనం, పారితోషికం బకాయిలు వెంటనే చెల్లించాలని, జాబ్‌చార్ట్‌లోని గ్రేడ్స్, పాయింట్స్ పద్ధతి తొలగించాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆశావర్కర్లు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్లంతా ధర్నా చేస్తూ ఆశా వర్కర్సుకు 2019 జనవరి నుండి గౌరవ వేతనం, పారితోషికాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతున్నాం. జాబ్‌చార్ట్‌లోని గ్రేడ్స్, పాయింట్స్ పద్ధతి వెంటనే తొలగించాలని కోరుతున్నాము.

ప్రభుత్వం ఆశాలకు రూ.10,000/- వేతనం చెల్లిస్తామని జీఓ నెం.87ను విడుదల చేసిందుకు ప్రభుత్వానికి ఎ.పి.ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీధన్యవాదాలు తెలియజేస్తున్నది.

ప్రభుత్వం జీఓ లో రూ.10,000/- ఇస్తామని చెబుతూ గైడ్‌లైన్స్‌లో మాత్రం ఆశా వర్కర్స్‌కు గ్రేడ్స్, పాయింట్స్ పద్ధతి పెట్టి నిరంతరం అభద్రతకు గురిచేస్తూ వేతనం గ్యారంటీ లేకుండా చేసే పద్ధతిని యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. కొత్త పనులను కూడా చేయిస్తూ పనిగంటలు, సెలవులతో సంబంధం లేకుండా పనిచేయిస్తున్నారు. కానీ జాబ్‌చార్ట్‌లో నిర్ణయించిన పాయింట్స్, గ్రేడ్ పద్ధతిని బట్టి వేతనం చెల్లిస్తామని చెప్పడం ఆశా వర్కర్స్‌ను మోసగించడమే. కావున ఆశా వర్కర్లందరికీ రూ.10,000/- వేతనం చెల్లించాలని కోరుతున్నాము.

సంక్షేమ పథకాలు ఆశా వర్కర్‌కు మరియు వారి కుటుంబ సభ్యులకు అందేలా చూడాలని కోరుతున్నాము. కావున పై సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించవలసిందిగా కలెక్టర్‌ను కోరుతున్నామన్నారు.

ఈ కార్యక్రమానికి యూనియన్ గౌరవాధ్యక్షురాలు వి.రామలక్ష్మి, యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, యూనియన్ ప్రధాన నాయకులు ఎస్.పద్మ, వి.మేరి, కళావతి, తారా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# స్పందన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యతనివ్వండి

- జివియంసి స్పందనకు 224 పిర్యాదులు - కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం : స్పందనలో నమోదైన ఫిర్యాదుదారులను సందర్శించి ఎన్ని రోజులలో పరిష్కరిస్తారన్నది తెలియజేయాలని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. అదే విధంగా ఫిర్యాదు పరిష్కారం అయిన తరు వాత ఆ విషయాన్ని ఫిర్యాదు దారుకు తెలియ జేయడంతోబాటు స్పందన రిజిష్టర్‌లో నమోదు చేయాలని వివరించారు.

జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మొత్తం 224 ఫిర్యాదులు అందాయి. జివియంసి కమిషనర్ డా.జి.సృజన ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 93, ఒకటవ జోన్‌కు సంబంధించి 24, రెండవ జోన్‌కు సంబంధించి నాలుగు, నాలుగవ జోన్‌కు సంబంధించి నాలుగు, ఐదవ జోన్‌కు సంబంధించి 85, ఆరవ జోన్‌కు సంబంధించి 14 ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 22, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 9, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 59, ఇఇ(పి.ఎల్ అండ్ సి) విభాగానికి సంబంధించి 3, అదనపు కమిషనర్(ఫైనాన్స్) విభాగానికి సంబంధించి మూడు, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 20, యుసిడి విభాగానికి సంబంధించి 18 , ఇతరులకు సంబంధించి 82 పిర్యాదులు అందాయి.

# గేట్లు తెరవక ముందే చంద్రబాబు పారిపోయారు

## వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి



అమరావతి: వరద నీటిలో మునిగిన ప్రతిపక్ష నేత ఇంటిని డ్రోన్‌తో చిత్రీకరిస్తే హత్యకు కుట్ర పన్నినట్టా.. అంటూ వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వి. విజయసాయిరెడ్డి ట్విటర్ వేదికగా ప్రశ్నించారు. పరువు గంగ పాలవుతుందని బ్యారేజి గేట్లు తెరవక ముందే సారు హైదరాబాద్ పారిపోయారని ఎద్దేవా చేశారు. విలవైన వస్తువులన్నీ తరలించారని, కృష్ణానది కావాలనే ప్రవాహాన్ని పెంచుకుంటోందని చివరకు నిందించేట్టున్నారు అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

ఎల్లో మీడియాకు పెద్ద చిక్కొచ్చి పడింది...

చంద్రబాబు బీజేపీని వదిలి పెట్టాక కుల మీడియా ఆ పార్టీని ఒక విలన్‌గా చిత్రీకరించిందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మొన్నటి దాకా మోదీని రాష్ట్ర శత్రువుగా ముద్ర వేసింది. ఇప్పుడు పచ్చ పార్టీ నాయకులంతా బీజేపీలోకి దూకుతున్నారు. ఎల్లో మీడియాకు పెద్ద చిక్కొచ్చి పడింది. రివర్స్ గేర్ వేయక తప్పడం లేదని ట్వీట్ చేశారు. గతంలో వరదలు, తుఫాన్లు వస్తే చంద్రబాబు వన్ మ్యాన్ షో నడిచేది. కలెక్టర్లపై ఆగ్రహం, సీఎం వచ్చేదాకా కదలని అధికార గణం అంటూ కుల మీడియా ఆయనను ఆకాశానికెత్తేది. ఇప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు. తిట్లు, సస్పెన్షన్లు లేవు అంటూ వ్యాఖ్యానించారు.

# పర్యావరణాన్ని రక్షిందాం జీవావరణాన్ని కాపాడుకుందాం

## హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యంలో విత్తనబంతుల తయారీ




విశాఖపట్నంః "రండి మన భూగోళాన్ని పచ్చని చెట్లతో కళకళలాడే విధంగా చేద్దాం. జీవావరణాన్ని కాపాడుకుందాం" అనే నినాదంతో డిప్యుటి జనరల్ మేనేజర్ సి వి ఎన్ దాస్ పేర్కొన్నారు. సోమవారం హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న "నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రంలో" స్వచ్ఛతా పక్షోత్సావాల్లో భాగంగా 500 మంది ట్రైనీస్‌తో మూడు లక్షల విత్తన బంతులు తయారు చేసే పనిని చేపట్టామన్నారు. విత్తన బంతులు తయారు చేయడానికి విత్తనాలు సేకరించి. 70 శాతం ఆవుపేడ, 30 శాతం మట్టి కలిపి చిన్నచిన్న బంతుల్లా తయారు చేసి ఒక చోట ఆరపెట్టాలి. వర్షాకాలంలో ఈ విత్తన బంతులను కొండ ప్రాంతంలో చల్లి సామాజిక వనాలు పెంచాలని సూచించారు. మనకూ, మన తర్వాత తరాలకూ మంచి ఫలాలను అందించాలి. పక్షులకూ, ఇతర జీవులకూ ఆహారాన్ని అందించాలి.

సీనియర్ మేనేజర్ జె. మహేష్ మాట్లాడుతూ పక్షులూ, జంతువులూ చాలా వరకూ బీజవ్యాప్తికి ఉపకరిస్తాయన్నారు. అందుకే మనం పక్షులూ, అడవి జంతువుల సంఖ్య పెరగడానికి కృషి చేయాలి. మనం పర్యావరణం పట్ల చైతన్యవంతులం కావాలి. మొక్కలు నాటడం, అడవులనూ, చెట్లనూ కాపాడటం. ఇందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు.

మేనేజర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వంద విత్తన బంతులు తయారు చేసి కొండ ప్రాంతంలో చల్లాలన్నారు. సమస్త జీవావరణాన్నీ జీవించనీయాలంటే అడవుల రక్షణ బాధ్యత మన మీదే ఉంది. అందుకనే మా వంతు కృషి చేస్తున్నాం. మీరూ భాగస్వాములు కావాలని కోరుతున్నామన్నారు. మేనేజర్ కె.ఆర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కాంక్రీట్ జంగిల్‌గా మారిన మన విశాఖ నగరంలో చల్లని వాతావరణం కావాలంటే చెట్లు అధికంగా పెంచాలి. చెట్లను నరకడం ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. విజయకుమార్ నేతృత్వంలోని పర్యావరణ మార్గదర్శి వైశాఖి సంస్థ కార్యదర్శి జె.రాజేశ్వరి, వాలంటీర్లు జి.దేవీ ప్రసాదు, జి.ఎన్. మురళి, గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపకులు జె.వి.రత్నం, సభ్యులు జయకృష్ణ, రామకృష్ణాలు పాల్గొన్నారు.

# 23 న కృష్ణాష్టమి సందర్భంగా రత్నగిరిపై గోపూజ కార్యక్రమం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 23 వ తేదీ ఉదయం 9-15 ని.లకు శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా రత్నగిరిపై ఉన్న కళామందిరం నందు గోపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడును.

అదేవిధంగా సాయంత్రం 7-15 ని.లకు కొండపైన రామాలయం వద్ద ఉట్లోత్సవం నిర్వహించడును.అనంతరం కొండ దిగువన తొలిపావాంచ వద్ద ఉట్ల ఉత్సవము జరిపి తదుపరి గ్రామోత్సవం నిర్వహించుచూ ఈరంకి వారి వీధి నందు ఉట్ల సంబరము ఘనంగా నిర్వహించబడును.

కావున భక్తులు,గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొనవలసినదిగా కార్యనిర్వహణాధికారి ఎం.వి.సురేష్ బాబు కోరారు.

# విజయభాను సంపాదకీయం

## ఆర్థికరంగంలో ఊపు

దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతుండటంతో పారిశ్రామికవర్గాలలో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించారు. సీతారామన్ ఇప్పటికే వివిధరంగాల ప్రతినిధులతో సమావేశమై ఈ విషమ పరిస్థితిని అధిగమించే మార్గాలపై సంప్రదింపులు జరిపారు. ఆర్థికరంగంలో ఊపు తేవడానికి ఉద్దీపన పథకాన్ని అమలుచేస్తారనే ఆశాభావం పారిశ్రామికవర్గాలలో వ్యక్తమవుతున్నది. పారిశ్రామిక సంస్థలకు పన్నులు తగ్గించడం, ప్రోత్సహకాలు అందించడం, వ్యయం తగ్గడంతోపాటు, సులభ వాణిజ్య విధానాలు అవలంబించాలని కేంద్రం భావిస్తున్నది. అనేక వస్తువులపై పరోక్ష పన్నులు తగ్గించడం ద్వారా వినియోగం పెంచాలనే ఆలోచిస్తున్నది. వాహనరంగాల వారు జీఎస్టీ తగ్గించాలని కోరారు. వాహన, రియల్‌ఎస్టేట్ రంగాలు మొదలుకొని సాధారణ వినియోగ వస్తువుల వరకు అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి, నిరుద్యోగం పెరిగిపోయింది. మోదీ మొదటి విడత పాలన ప్రారంభం అయినప్పటి నుంచి పలురంగాలలో అనిశ్చితి నెలకొన్నది. కానీ కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. మోదీ ప్రభుత్వం తీసుకున్న రెండు ప్రధాన నిర్ణయాలు దేశ ఆర్థికవ్యవస్థను దెబ్బతీశాయి. మొదటి పెద్ద నోట్ల రద్దు అయితే రెండవది జీఎస్టీ. పెద్దనోట్ల రద్దు వల్ల ప్రధాని చెప్పిన సత్ఫలితాలు ఏవీ రాలేదు. కానీ ప్రతి రంగం దిగజారిపోయింది. బ్యాంకింగ్ రంగంతో నిమిత్తంలేని గ్రామీణ ఆర్థికవ్యవస్థ మరింతగా ఛిన్నాభిన్నమైంది. ఇప్పటికే సంక్షోభంలో ఉన్న వ్యవసాయంరంగం కోలుకోలేనంత దెబ్బతిన్నది. చిన్న మధ్యతరహా పరిశ్రమల రంగాలు, చిల్లర వ్యాపారాలు కుదేలయ్యాయి. ఈ ప్రభావం మిగతా అన్నిరంగాలపై పడ్డది. మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగా, 2018 నుంచే స్థూల, సూక్ష్మ ఆర్థిక సూచికలు మందగమనాన్ని సూచించాయి. ఆర్థిక సంక్షోభం ముంగిటిలో ఉన్నామనేది ఇప్పుడు స్పష్టంగా తెలిసిపోతున్నది. ఆర్థికవేత్తలు చెబుతున్న ప్రకారం- నేటి ఆర్థిక వ్యవస్థలకు ప్రధాన చోదకశక్తులు పబ్లిక్, ప్రైవేట్ పెట్టుబడులు, ఎగుమతులు, వినియోగదారుల కొనుగోళ్ళు. ఈ నాలుగు రంగాలు ఆశాజనకంగా లేవు. ప్రత్యక్షం గా, పరోక్షంగా ప్రభుత్వ విధానాల ప్రభావం వల్ల ప్రైవేటు పెట్టుబడులు తగ్గిపోయాయి. 2014లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండేండ్లకు 2006- 07 నుంచి 2010- 11 నాటి వరకు సగటున 25 లక్షల కోట్ల మేర ప్రైవేటు పెట్టుబడులు వస్తే, మోదీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2018-19 నాటికి 9.5 లక్షలకు దిగజారాయి. 2004 నుంచి ఏనాడు ఇంత కనిష్ఠ స్థాయిలో కొత్త పెట్టుబడులు లేవు. మొత్తం పెట్టుబడుల్లో మూడింట రెండు వంతులు ఉన్న ప్రైవే టు పెట్టుబడులు 47 శాతానికి పడిపోయాయి. అత్యంత ఎక్కువగా విదేశీ పర్యటనలు చేసిన ప్రధాని మోదీ హయాంలో ఎగుమతులు భారీగా తగ్గిపోయాయి. 2013-14లో 314.88 బిలియన్ డాలర్ల ఎగుమతులు ఉంటే, ఆ తరువాత తగ్గిపోవడమే తప్ప మించిపోయింది లేదు. కొంతకాలం ప్రభుత్వ పెట్టుబడులు ఆర్థికవ్యవస్థను నడిపించాయి. జీఎస్టీ వసూళ్ళు ఆశించినస్థాయిలో లేకపోవడంతో పాటు, లోటును తగ్గించడం, ఇతర కారణాల వల్ల ప్రభుత్వం వ్యయం తగ్గిపోయింది. మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు వినియోగదారుల కొనుగోళ్ళు తగ్గిపోయాయి. వినియోగదారులు వస్తువులు కొనకుంటే చాలు, ప్రపంచమంతా మహామాంద్యంలో కూరుకుపోక తప్పదు. ఇప్పుడు జరుగుతున్నది అదే. ఈ పరిస్థితుల్లో ఏదో ఉద్దీపనలు కాదు, భారీగా విధానపరమైన మార్పులు అవసరం. దేశీయరంగంలోనే కాదు, అంతర్జాతీయంగా కూడా అనిశ్చిత పరిస్థితులు ఉన్నాయనేది మోదీ ప్రభుత్వం గమనంలోకి తీసుకోవాలె. ప్రపంచవ్యాప్తంగా 2020 నాటికి పలు దేశాలు మాంద్యంలోకి జారిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థ కుంచించుకుపోతున్నది. ఇటలీలో ఉత్పత్తి తగ్గింది, నిరుద్యోగం పెరిగింది. భారీ రుణం, రాజకీయ అనిశ్చితి మూలంగా ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని నాలుగవ పెద్ద ఆర్థికవ్యవస్థ అయిన జర్మనీ కూడా మాంద్యం అంచున ఉన్నది. లాటిన్ అమెరికాలో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ అయిన బ్రెజిల్‌లో ఉత్పత్తి తగ్గింది, నిరుద్యోగం పెరిగింది. మెక్సికో ఆర్థికవ్యవస్థ బలహీనంగా ఉన్నది. వాణిజ్య కేంద్రాలుగా భాసిల్లిన హాంకాంగ్, సింగపూర్ ఆర్థిక వ్యవస్థలు లుకలుకలాడుతున్నాయి. చైనా ఆర్థిక వ్యవస్థ కూడా మందగమనంలోనే ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తిరంగం సంక్షోభంలో ఉన్నది, సేవల రంగం కూడా దిగజారింది. అమెరికా, చైనా వాణిజ్య- సాంకేతిక యుద్ధం ముగిసే సూచనలు కనిపించడం లేదు. యూరప్‌లో ఆర్థిక, రాజకీయ, విధానపరమైన సమస్యలు తలెత్తున్నాయి. భారత్ వర్ధమాన దేశమే కాదనీ, ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల కింద రాయితీలు పొందడమేమిటని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. తాము డబ్ల్యుటివో నుంచి బయటపడతామని కూడా బెదిరిస్తున్నారు.

# గీతం నర్సింగ్ కోర్సులలో ప్రవేశాలు

సాగర్‌నగర్ : గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ద్వారా నిర్వహిస్తున్న బిఎస్సీ నర్సింగ్ కోర్సులో 2019-20 సంవత్సరానికి గాను ప్రవేశాలకు ఈ ఏడాది దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కనకలక్ష్మి తెలిపారు. ఇంటర్మీడియట్ తత్సమాన పరీక్షలలో సైన్స్ సబ్జెక్టులతో 45 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ నర్సింగ్ బ్రిడ్జ్ కోర్సు 45 శాతం ఉత్తీర్ణులైన వారు కూడా ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు.ఎమ్మెస్సీ నర్సింగ్ ప్రాక్టిషనర్ ఇన్‌క్రిటికల్‌కేర్ కోర్సులో ప్రవేశం పొందగోరేవారు బిఎస్సీ నర్సింగ్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని ఏడాది వృత్తి అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఎమ్మెస్సీ నర్సింగ్‌లో ప్రవేశం పొందిన వారికి నెలకు 10 వేల రూపాయల ఉపకారవేతనం ఉంటుందన్నారు. విద్యార్థులు గీతం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.gitam.edu ద్వారా దరఖాస్తులును డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని సూచించారు.పూర్తి చేసిన దరఖాస్తులను గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ కార్యాలయానికి అందే విధంగా పంపాల్సి ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 0891-2727236, 2866555,9703430511, 7331136730 లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

# చూశారా విశాఖ ఒక దృశ్య కావ్యం



విశాఖపట్నం : నగరానికి చెందిన ప్రముఖ పర్యాటక స్వచ్ఛంద సంస్థ డిజిటల్ వీడియోస్ మరియు విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్, టీవీ టూరిజం ఛానల్ అధినేత మరియు ఫిలిం డైరెక్టర్ అయిన శ్రీ ఆర్.మణి భూషణ్ కుమార్ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రూపొందించబడిన, ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన , దృశ్య కావ్యం చూశారా విశాఖ 2003 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఉత్తమ పర్యాటక చిత్రంగా అవార్డు , 2005లో ఇంగ్లీష్ వెర్షన్ చిత్రానికి విజిట్ విశాఖ కు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతులమీదుగా ఉత్తమ పర్యాటక చిత్రంగా అవార్డు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ నుండి రెండుసార్లు ఉత్తమ అవార్డులు సాధించిన ...

ఈ చిత్రం లో విశాఖ అందాలు తన కంటితో చూసి, తన కెమెరాతో భద్రపరిచి, ఎంతో రమణీయంగా చిత్రీకరించి, సజీవమైన దృశ్యాలు , సుందర ప్రదేశాలు , కొండలను , సాగర తరంగాలను... మంచి అభిరుచితో చూపించి, విశాఖ ఖ్యాతి ని నలుదిక్కుల వ్యాపించడానికి, విశాఖపట్నం జిల్లా పర్యాటక ప్రదేశాలు... కళ్ళకు కట్టినట్లు చూపిం చడంలో మణి భూషణ్ ఫోటో గ్రఫీ నైపుణ్యతను మనం చూడవచ్చు.

పదహారేళ్లుగా చూశారా విశాఖ ను పర్యాటకులకు అందిస్తూ... రామకృష్ణ బీచ్ నుండి అరకులోయ వరకు.. ఒక డిజిటల్ టూర్ గైడ్ అందించినందుకు... ప్రపంచ ఫోటో గ్రఫీ దినం సందర్భంగా ...సంస్థ సభ్యులు నిర్మాత గుణదిత్య, ఎడిటర్ నీరజ, సీఈవో సీతారామస్వామి తదితరులు... వారిని, పర్యాటక రంగానికి వారు చేస్తున్న కృషిని, అభినందించి చూశారా విశాఖ విశాఖ ఉన్నంత కాలం చరిత్రలో నిలిచిపోయే చిత్రం అని కొనియాడారు. వారి దర్శకత్వంలో రాబోయే చిత్రాలు ప్రజల మనసు దోచుకునే విధంగా ఉండాలని ఆకాంక్షించారు.

# విద్యార్థులకు స్టేషనరీ స్కాలర్‌షిప్‌లను అందించిన గంగవరం పోర్టు



గాజువాక: సామాజిక కార్యక్రమంలో భాగంగా గంగవరంపోర్టు యాజమాన్యం ఎంపికచేసిన విద్యార్థులకు స్టేషనరీతోపాటు స్కాలర్‌షిప్‌లను అందజేసింది. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాపరిషత్ హైస్కూల్, ఎంపిపి ఎలిమెంటరీ స్కూల్, పల్లెపాలెం ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ చెందిన సుమారు 550విద్యార్థులకు అందజేసారు. అలాగే పెదగంట్యాడ మండలం గంగవరం గ్రామంలోని గంగవరం హైస్కూల్‌లో ప్రతిభావంతులైన 10వ తరగతి విద్యార్థుల(2018-2019)కు స్కాలర్ షిప్‌లను అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ సియస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా గంగవరం పోర్టు అందిస్తున్న సహాకారం సంతోషకరంగా ఉందని అన్నారు. ఇటువంటి కార్యక్రమాల వలన పరిసరప్రాంత విద్యార్థులకు ఎంతో మేలని అన్నారు. సంస్థ సిఇఓ సాంబశివరావు మాట్లాడుతూ విద్యావసతులు మెరుగు పరచడంతో పాటుగా ప్రోత్సహకరమైన వాతావరణం సృష్టించడం మావంతు ప్రయత్నంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిసరప్రాంత అభివృద్ధికి కట్టుబడి పోర్టు యాజమాన్యం ఉందనిఅన్నారు. ఈ తరహా కార్యక్రమాలతో బలీయమైన సమాజానికి మద్దతునందిస్తున్నామని అన్నారు.

అనంతరం మొదటి బహుమతిగా రూ. 10వేలను కుమారి జయకు, రూ.5వేలను రెండోవబహుమతిగా కుమారి ప్రమీలకు రూ.5వేలను తృతీయ బహుమతిగా కుమారి ఎం.మంజూషలకు అందజేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధుల వి.జనార్థనరావు, బి.బాలకృష్ణ, ఎల్‌పియస్‌రాము నాయుడు, గంగవరం పోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దోమలను నిర్మూలించండి

## ప్రజారోగ్యాన్ని కాపాడండి

## జిల్లా జాయింట్ కలెక్టర్ శివశంకర్



విశాఖపట్నం : ప్రపంచ దోమల దినోత్సవ (World Mosquito day) ప్రతీ ఏడాది ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవముగా జరుపు కుంటారు. సర్ రోనాల్డ్ రాస్ 1897 ఆగస్టు 20న ఆడ ఎనాఫిలస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాధి మానవులకి వ్యాప్తి చెందుతుంది అని కనుగొన్నారు. దీని గుర్తుగా ప్రతీ ఏడాది ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవముగా నీర్వహించడం జరుగుచున్నది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం విశాఖపట్నం జిల్లాలో, జిల్లా జాయింట్ కలెక్టరు నేతృత్వంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వ ర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సమావేశము నిర్వహించడము జరిగినది. ఈ సమావేశము నందు జాయింట్ కలెక్టరు శివశంకర్ మాట్లా డుతూ అన్ని శాఖల వారు (పంచాయతీ రాజ్, మునిసిపాలిటి, నీటి సరఫరా విభాగము, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, అటవీ శాఖ, డి. ఆర్. డి.ఏ మొదలుగునవి) దోమల ఉత్పత్తి జరగకుండా తను తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, దోమలు పెరిగే ప్రదేశాలు మరియు వాటిని నియంత్రించే పద్ధతులపై పూర్తి స్థాయిలో ప్రజలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్. తిరుపతి రావు మాట్లాడుతూ, మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్న జీవి వలన వస్తుంది. ఎనాఫిలాస్ అనే దోమ కుట్టడం వలన ఒకరి నుండి ఒకరికి వ్యాపిస్తుంది. తీవ్రమైన తలనొప్పి, వొళ్ళు నొప్పులు, చలి వణుకుతో కూడిన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం రావడం, చెమటలు పట్టడం, వాంతులు వికారం వంటివి మలేరియా లక్షణాలు కాగా, జ్వరం ఉన్న వాళ్ళు ప్రాదమికి అరోగ్య కేంద్రాలలో ను, ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రిలోను, ఆరోగ్య కార్యకర్తల వద్ద రక్త పరీక్ష చేయించుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలి. చికిత్స తీసుకోవాలి. ముంఠియా వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది కావున దోమలు పెరగకిండా ఎంసెరాలను పరిశు భ్రంగా ఉండాలి. దోమతెరలు అందరు వాడాలి. ఇంటి లోపల, బయటా నీటి నిల్వలు లేకుండా చూడాలి.

ఉన్న నీటి నిల్వలు వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టాలి. తాగి పారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, వాడి పారేసిన టైర్లు, రుబ్బు రోళ్ళు, ప్లాస్టిక పాత్రల్లో దోమల లార్వా పెరిగే అవకాశం ఉంది. ఫ్రిడ్జ్ లు, ఎయిర్ కూలర్లు, ఫ్లవర్ వాజ్ లు దోమల ఉత్పత్తి వనరులుగా ఉన్నందున ప్రజలు వాటిల్లో నీటిని ప్రతి మూడు రోజులకు ఖాళీ చేయాలి. జిల్లా లో సంతలు జరిగే ప్రతీ చోట మలేరియా క్లినిక్కులు నిర్వహిస్తాము. ప్రజలంతా భాగస్వాములు కావాలని తద్వారా మలేరియా నివారణకు పాటు పడగలరని కోరుచున్నాము.

# గణేశ్ కుమార్ సొంత నిధులతో రూ. 5/-కే భోజనం

విశాఖపట్నం : గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌లో 21వ వార్డు మహారాణిపేటలోని సాలిపేట ఏరియాలోని కింగ్ జార్జ్ ఆసుపత్రివద్ద దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఐదు రూపాయలకే భోజ నం అందచేస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం చేపట్టి మూడు రోజులైందని, ప్రభుత్వం మరల ఈ క్యాంటీన్లు ప్రారంభీంచేవరకు తాను ఇలా రోజూ భోజనం అందచేస్తానని చెప్పారు. పేదవాడి ఆకలి తీర్చడం తనకు చాలా ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చా రామిరెడ్డి, చిన్న రెహమాన్, పరదేశి యాదవ్, రామానంద్, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారిణి భాగ్యలక్ష్మికి ఘన సత్కారం



గాజువాక : ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మిని మల్కాపురం సెయింట్‌ఆన్స్ మహిళ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు శాలువావేసి, పుష్పగుచ్ఛాన్నిచ్చి ఘనంగా సత్కరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంద్వారా ఆమె అందిస్తున్న సేవలకు గుర్తించి స్వాతంత్ర్యది నోత్సవం నాడు ఆమెకు జిల్లాకలెక్టర్ వినయ్‌చంద్ జిల్లాఇంచార్జ్‌మంత్రి మోపిదేవివెంకటరమణ చేతులుమీదుగా ప్రతిభ పురస్కారాన్ని అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపద్యంలో కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందనసభలో ఆమెను సత్కరించారు. ఈ సంధర్భంగా కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ ఇమాక్యూలేట్ మాట్లాడుతూ పరులకు చేసిన సేవలో అంకితభావం, చిత్తశుద్ధి ఉంటే చాలన్నారు. గత 26సం.లుగా భాగ్యలక్ష్మి నగరంలో అనేకమందికి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రశంసలను పొందారన్నారు. సామాజిక సేవలే కాకుండా మహిళల హక్కులు, సమానత్వం, మానవహక్కులు, ఇలా సామాజాన్ని ప్రభావితం చేసే అంశాలపై అనేక సేవలు, సందేశాలను, అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారని గుర్తు చేసారు. ఆమె మరిన్ని కార్యక్రమాలతో ముందుకు పోతూ మరింత కీర్తిని పొందాలని కళాశాల తరుపున మనస్ఫూర్తిగా కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమ, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండే ఇసుక సరఫరా



విశాఖపట్నం: సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా నేటి నుండే ఇసుక సరఫరా చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎల్. శివ శంకర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్ లో మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇసుక గూర్చి ఎవరిని సంప్రదించాలి ? ఇసుక కోసం దరఖాస్తు చేసుకొని, దరఖాస్తుకు నిర్మాణానికి సంబంధించిన ఫోటో, ప్లాన్ అప్రూవల్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డులు జత చేసి ఎం.వి.పి. కాలనీలోని టాస్క్ ఫోర్స్ పోలీసు ఆఫీసు వద్ద మైన్స్ కార్యాలయం ఉన్నది. అక్కడ రెవెన్యూ, పోలీస్, సిటీ ప్లానర్, మైన్స్ శాఖ వారు ఉంటారు వారు దరఖాస్తును పరిశీలిస్తారు. ఎంత ఇసుక ఇస్తారు ? దరఖాస్తు పరిశీలించి ఒక యూనిట్ (3 క్యూబిక్ మీటర్లు ఒక ట్రాక్టర్ లోడ్) రూ.4,500/-లు

ఎంవిపి కార్యాలయంలోనే చెల్లిస్తే రశీదు ఇస్తారు.

ఇసుక ఎక్కడ ఇస్తారు ? రశీదు తీసుకొని ముడసర్లోవలోని జివిఎంసి గార్బేజి ప్లాంట్ ప్రక్కనే ఇసుక స్టాక్ పాయింట్ ఉంటుంది. రశీదు అక్కడ చూపించాలి. అక్కడ ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పోలీసు, మైన్స్ శాఖ వారు ఉంటారు. ఇసుక ఎలా తీసుకు వెళ్లాలి ? లారీ అసోసియేషన్ సెక్రటరీ కె. రమణ ఫోన్ నం.7674922888 సంప్రదించాలి. రవాణా చార్జీలు లబ్ధిదారులే చెల్లించుకోవాలి. ఇసుక స్టాక్ పాయింట్ ఫోన్ నం. 9949610479. సమస్య ఏమైనా ఉంటే వారు మైన్స్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఫోన్ నం.9949565479 ను సంప్రదించాలి.

ఎప్పటి నుండి ఏ సమయం నుండి ఇసుక ఇస్తారు ? నేటి నుండి ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు.

రెండవ సారి ఇసుక కావాలంటే భవనం యొక్క పని, జరిగిన కొత్త ఫోటో తీసి దరఖాస్తుతోపాటు ఎంవిపి కాలనిలోని ఎడి మైన్స్ కార్యాలయంలోనే అందజేయాలి. కొత్త ఇసుక విధానం వచ్చే వరకు సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇసుక సరఫరా చేయనున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 84 యూనిట్ల ఇసుక అందుబాటులో మైన్స్ ఎ.డి. తమ్మినాయుడు తెలిపారు.

# డ్రోన్ ఘటనపై గవర్నర్‌కు తెదేపా నాయకుల ఫిర్యాదు

అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు నివాసంపై డ్రోన్ ఎగురవేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ఆ పార్టీ నేతలు గవర్నర్ బిశ్వభూషణ్‌ను రాజ్‌భవన్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. నాలుగు పేజీల లేఖను గవర్నర్‌కు అందజేశారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో చంద్రబాబు భద్రతను కుదించిన ప్రభుత్వం.. హైకోర్టు ఆదేశాల తర్వాత తిరిగి భద్రతను పెంచడాన్ని తెదేపా నేతలు ఈ సందర్భంగా గవర్నర్‌కు గుర్తు చేశారు. వైకాపా ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు పూనుకొంటోందని, డ్రోన్ ఎగరవేస్తూ పట్టుబడిన వ్యక్తి జగన్ నివాసంలో ఉండే కిరణ్ ఆదేశాల మేరకే చిత్రీకరించానని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందని తెదేపా నేతలు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని, గల్లా జయదేవ్, టీడీఎల్పీ ఉపనేతలు అచ్చెన్నాయుడు, బుచ్చయ్యచౌదరి, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామారావు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు సహా 15 మంది సభ్యుల బృందం గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. డ్రోన్ అంశంపై ఇప్పటికే గుంటూరు ఐజీకి తెదేపా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

**వరదలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం: అచ్చెన్న**

గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం పార్టీ నేతలు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. వరద సహాయక చర్యల్లో ప్రభుత్వ వైఫల్యంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని అన్నారు. కృష్ణానదికి వరదలు వస్తాయని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు పడలేదని, ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల మనకు వరదలు వచ్చాయని మండిపడ్డారు. వరద సహాయక చర్యల్లో ప్రభుత్వ నిర్లక్ష్యంపై ధ్వజమెత్తారు. కనీస అవగాహన లేకుండా జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతున్నారని విమర్శించారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

ASTROLOGY
శ్రీ శ్రీ కాణిపాకం స్వామి జ్యోతిష్యా/వాస్తు సమస్యలకు 25 సం॥రాలుగా సరైన పరిష్కారములు సూచిస్తున్నారు. అవసరమైన వారు పర్సనల్ అపాయింట్‌మెంట్ కొరకు ఈ ఫోన్ నెంబర్‌ను సంప్రదించవలెను.
9393110416

## నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

నర్సీపట్నం : నర్సీపట్నంలోని బిసి కాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామని నర్సీపట్నం టౌన్ సిఐ లక్ష్మణ రావు తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బంది పేకాట స్థావ రంపై దాడులు నిర్వహించా రన్నారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి రూ.1300 నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

## పిటిజి కాలనీలో సిమెంటు రోడ్డు వేయాలి



అరకులోయ : అరకు పట్టణ కేంద్రంలో గల రైల్వే రిక్వెస్ట్ వద్ద గల పి.టి.జి కాలనీలో సిమెంటు రోడ్డు వేయాలని, కాలనీవాసులు కోరుతున్నారు.ఈ పి.టి.జి కాలనీలో సుమారు 60 కుటుంబాలు జీవిస్తున్నప్పటికీ సిమెంటు రోడ్డు లేక ఈ వానకాలంలో నాన అవస్థలు పడి బురద రోడ్డులో నడుస్తూ ఇబ్బంది పడుతున్నామంటున్నారు. కాబట్టి సంబందిత అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## తూకాలు తేడా వస్తే శిక్షలు తప్పవు

పెద్దాపురం : కొనుగోలుదారులకు వర్తకులు ఇచ్చే సరకులలో తూకాలలో తేడా వచ్చిన, నాణ్యత లోపించిన, సహించేది లేదని పెద్దాపురం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సరోజని హెచ్చరించారు. మండలంలోని దివిలి, చంద్రమాంపల్లి, డైలీ మార్కెట్లు, మాంసం విక్రయదారులతో ఆదివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజని మాట్లాడుతూ తూకాల ద్వారా వినియోగదారులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని, కాలం చెల్లిన తూకం రాళ్ళు మొదలగునవి ఉపయోగించరాదని, అట్లు ఉపయోగించిన ఎడల లీగల్ మెట్రాలజీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగునని, వ్యాపారులు గడువులోగా ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్ వేయించుకోవాలని ఆమె హెచ్చరించారు. అనంతరం కొన్ని దుకాణాలను తనిఖీ చేశారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం

**వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు**



శ్రీకాకుళం : క్రీడలతోనే మానసికోల్లాసం సొంతమవుతుందని శ్రీకాకుళం శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. టౌన్ హాలులో నిర్వహించిన జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తుంటుందని, సిక్కోలులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిక్రీడాకారులున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

వివిధ క్రీడాంశాల్లో రాణించేందుకు క్రీడా సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రెయ్యమ్మతల్లి పేరిట ఈ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఐ.అప్పన్నయాదవ్‌తో పాటు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అంధవరపు వరం, ఎంపీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రావికమతం : రావికమతం మండలం మేడివాడ, దిడ్డి, బాదనపూడి రెవెన్యూలో సుమారు 40 సంవత్సరాలుగా బల్లా ప్రగాడ సుబ్బారావు, రాజారావు భూమిలో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రావికమతం తహశీల్దార్ కనకారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివలంక కొండలరావు, సిపై మండల కార్యదర్శి జి.జోగిరాజులు మాట్లాడుతూ మేడివాడ, దిడ్డి, బాదనపాడు గ్రామ రైతులు సుబ్బారావు, రాజారావులు గతంలో వాళ్లు అమ్ముకోగా మిగిలిన సుమారు 50 ఎకరాల భూమిలో సర్వే నెంబరు 40, 79లో ఆయా గ్రామాల రైతులు 40 సంవత్సరాలు సాగు చేస్తున్నారన్నారు. గతంలో ఆర్డీవో, తహశీల్దార్‌లకు సిబ్బందితో కలిసి ప్రభుత్వ భూమిని బల్లా ప్రగాడ వారి భూమిని సర్వే జరిపి సాగులో ఉన్న వారికి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి సుమారు ఆరు నెలలు కావస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కావున వెంటనే దరఖాస్తును పరిశీలంచి సాగులో ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని వారు కోరారు. మేడివాడ గ్రామంలో ఇళ్ల స్థలాలు లేనివారికి కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సేనాపతి శ్రీను, గోగం లక్ష్మణదొర, బోడి అప్పన్న, మేడివాడ, దిడ్డి, బాదనపాడుఐతులు బోయి రామన్నదొర, వజ్రపు లక్ష్మి, కొండమ్మ, యాళ్ల చింతల్లి, బయవరపు అర్జున తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల మేలు కోసమే ఈ ఒప్పందం

భీమునిపట్నం : కార్మికుల మేలు కోసం ఈ ఒప్పందం ఒప్పుకున్నట్లు ఇంటక్ అధ్యక్షులు కాకర్లపూడి వరహాలరాజు అన్నారు. ఇంటక్, కాంగ్రెస్ కార్మిక సంఘం, టి.ఎన్.టి.యు.సి ఆధ్వర్యంలో సంగివలసలో ఏర్పాటు చేసిన జ్యూట్ మిల్ కార్మిక సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ళుగా జ్యూట్ మిల్ మూతపడి కార్మికులు చాలా ఇబ్బందులు పడ్డారనీ, అప్పట్లో మిల్ మూతపడినపుడు కార్మికులు ఎన్నోసార్లు పోరాటాలు చేసారనీ అన్నారు. అప్పటి ప్రభుత్వం జ్యూట్ మిల్ యజమాని తో చర్చలు జరిపినా ఎలాంటి ప్రయోజనం లేదనీ అన్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రి ము త్తంశెట్టి శ్రీనివాసరావు వద్దకు వెళ్ళి జ్యూట్ మిల్ సమస్య గురించి చెప్పగా ఆయన స్పందించినట్లు తెలిపారు.ఈ రెండు నెలలలోనే మంత్రులు ముత్తంశెట్టి శ్రీనివాస రావు, జయరాంలు మిల్లు యాజమాన్యంను రప్పించి నాలుగు సంఘాలు, కార్మికుల ఆమోదం పై నష్టపరిహారం ఒప్పందం జరిగిందనీ అన్నారు. అయితే దీనికి ఒక యూనియన్ మాత్రం ఒప్పుకోలేదనీ చెప్పారు. కార్మికులకు మేలు చేయాలనే ఉద్దేశ్యం తో మేము చేస్తే అది మా లాభం కోసం చేసినట్లు అనుకోవడం బాధాకరమనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి,ప్రధాన కార్యదర్శి చిల్ల వెంకట రమణ, ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పల రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునకాల ఆదినారాయణ రెడ్డి, నరవ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన పథకాన్ని వినియోగించుకోండి

వ్యవసాయ శాఖ అధికారిణి ద్వారకాదేవి



పెద్దాపురం : వ్యవసాయ శాఖ ఏవో ద్వారకా దేవి. దేశంలోని సొంత దూమిని కలిగిన చిన్న మరియు సన్నకారు రైతులకు సామాజిక భద్రత కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన ప్రారంభించడం జరిగిందని స్థానిక వ్యవసాయ శాఖ అధికారిణి ద్వారకా దేవి సోమవారం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. ఈ పథకంలో చేరడానికి 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్న మరియు సన్నకారు రైతులను మాత్రమే అర్హులుగా గుర్తించారని తెలిపారు. ఈ పథకంలో చేరిన రైతులు వారి వయస్సును బట్టి నెలకు రూ.55 నుండి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.60 సంవత్సరాలు నిండిన తర్వాత నెలకు రూ.3000 స్థిర పెన్షన్ ఇవ్వబడుతుందని ఆమె తెలిపారు. ఈ పథకంలో రైతులు స్వచ్ఛందంగా సగం ప్రీమియం చెల్లిస్తే మిగిలిన సగం ప్రీమియం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు.చిన్న మరియు సన్నకారు రైతుల జీవిత భాగస్వాములు కూడా ఈ పథకంలో విడివిడిగా చేరడానికి అర్హులని, వారికి కూడా 60 సంవర్సరాల తర్వాత రూ. 3000 పెన్షన్ లభిస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని మండలం లోని చిన్న మరియు సన్న కారు రైతులు సామాజిక భద్రత కోసం వినియోగించుకోవాలని ఏవో కోరారు.

# ఘనంగా ఫోటోగ్రాఫీ దినోత్సవం



యానాం : కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం లో యానాం ప్రొఫెషనల్ ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అహ్మద్ తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సభ్యులు బద్రి ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జిఎంసి బాలయోగి రోడ్డు మార్గం లా ఉన్న హమ్మద్ ఫోటో స్టూడియోలో ఈ కార్యక్రమం నిర్వహించారు తొలిత యూనియన్ సభ్యులు సమక్షంలో కెమెరా సృష్టి కర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బారీకేకును కట్ చేసి సంభరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కరీమ్, ఉపేంద్ర, హను మంతరావు, దుర్గబాబు,. రహీమ్, పట్నాల హరి యూనియన్ సభ్యులు పోటో టేకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు చేయాలి



బలగ : జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఎన్టీఆర్ మైదానంలో జరగనున్న పను లను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు వస్తున్నారని, వారికి తాగు నీరు, భోజనం, వసతి, వైద్య సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

# 25 వరకు ఈకేవైసికి గడువు

**తహశీల్దార్ శ్రీనివాసరావు**

నాతవరం : ఈ నెల 25లోగా ప్రజాసాధికారిత సర్వేలో లేని వారంతా నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 42 రేషన్ డిపోల పరిధిలో 3,120 మంది ఈకేవైసి చేయించుకోవాల్సి ఉందన్నారు. తాజాగా 569 మంది ఈకేవైసి నమోదు చేయించుకున్నారని మిగతా వారంతా కూడా ఈ నెల 25 లోగా ఖచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. ఈకేవైసి నమోదు బాధ్యత వీఆర్వోలు, రేషన్ డీలర్లకు ప్రత్యేకంగా అప్పగించామన్నారు. సాధికారిత సర్వేలో నమోదైతే సంక్షేమ పథకాలకు అవకాశం ఉంటుందన్నారు.

## ఎస్‌బిఐ ప్రాంతీయ సమాలోచన సమావేశం



విశాఖపట్నం : కొత్త ఆలోచనలు మరియు జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా బ్యాంకు పనితీరును సమీక్షించడానికి మరియు బ్యాంకు యొక్క ప్రాథమిక కన్సల్టేటివ్ ప్రక్రియ యొక్క మొదటి దశను డిజైన్ చేయడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 524 ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో శాఖలను కలిపి 17 మరియు 18 ఆగస్టుఒక చర్చా కార్యక్రమాన్ని బ్యాంకు మొట్ట మొదటిసారిగా నిర్వహించింది. విశాఖపట్నం ప్రాంతీయ వ్యాపార కార్యాలయంలో నిర్వహిం చబడిన ఈ చర్చా కార్యక్రమంలో ఎస్బిఐ యొక్క లీడర్షిప్ టీం నుండి వై. సత్యనారాయణ ప్రసాద్, విశాఖపట్నంహరిత పూర్ణిమ, రీజినల్ మేనేజర్, సెంట్రల్ రీజియన్, ఎం శ్రీనివాసరావు, రీజినల్ మేనేజర్, విశాఖపట్నం రూరల్ రీజియన్, నాగేశ్వరరావు, రీజినల్ మేనేజర్, విశాఖపట్నం సబర్బన్ రీజియన్ మరిఉంది.

భాస్కర్, అమరావతి సర్కిల్ పర్యవేక్షణలో హాజరయ్యారు. ప్రాథమిక కన్సల్టేషన్ ప్రక్రియ సమయంలో ఉద్భవించిన సలహాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ లోని వివిధ రంగాలకు రుణాలని పెంచడానికి గల మార్గాల అన్వే షణ, ఆవిష్కరణలకు సాంకేతికతను అధికంగా వినియోగించడం మరియు బిగ్ డేటా విశ్లేషణలకు అనుగుణంగా చేయడం మరియు పౌర కేంద్రిత మరియు సీనియర్ సిటిజన్ల, రైతుల, చిన్న పారిశ్రామికవేత్తల, వ్యాపారస్తుల యువకుల, విద్యార్థుల, మహిళల ఆకాంక్షలు మరియు అవసరాలకు మరింతగా ప్రతిస్పందించేలా బ్యాంకింగ్ ని తీర్చిదిద్దడం ఈ సమావేశం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

బ్యాంకు పని తీరును మెరుగుపరచుకోవడానికి మరియు భవిష్యత్ రోడ్ మ్యాపు నిర్ధారించుకోవడానికి ఉపయోగపడే అనేక అమలుపరచదగిన మరియు వినూత్న సూచనలను ఎస్బిఐ సమిష్టిగా గుర్తించింది. ఈ సూచనలను క్రోడీకరించి ప్రతి రీజియన్ లోని శాఖ యొక్క తులనాత్మక పనితీరు మూల్యాంకనము తో పాటు రాష్ట్రస్థాయిలో తదుపరిచర్చల కోసం జోనల్ స్థాయి కి పంపించింది. ఎస్ఎల్బిసి స్థాయి తర్వాత ఇంట్రా మరియు ఇంటర్బ్యాంక్ పనితీరు రెండింటినీ పోల్చడానికి మరియు జాతీయ రంగ బ్యాంకులు అన్నింటిలో అమలు చేయడానికి ముందున్న మార్గాలకు సంబంధించిన సూచనలను ఫైనలైజ్ చెయ్యడానికి అంతిమంగా జాతీయ స్థాయిలో సమాలోచనలు జరపడానికి బ్యాంకు నిర్ణయించింది. సంప్రదింపుల ప్రక్రియ వల్ల బ్రాంచ్ స్థాయిలో నవీకరించబడిన భాగస్వామ్య భావన పునరుద్ధరించబడింది మరియు భవిష్యత్తు కొరకు రోడ్ మ్యాప్ అమలు చేయడం, దాని పనితీరును మెరుగు పరచడం మరియు జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా తమకు తాము మలుచుకోవడానికి బ్యాంకు సిద్ధమైంది. ఈ విధంగా భారత అభివృద్ధి గాధలో పాలుపంచుకునే ఆదేశాలను పాటించడంలో సఫలీకృతం అవ్వచ్చు.

### వరద సహాయక చర్యల్లో

# ప్రభుత్వం విఫలం

**తెదేపా జిల్లా అధ్యక్షురాలు శిరీష విమర్శ**

శ్రీకాకుళం : రాష్ట్రంలో వరదలు ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేస్తుంటే సహాయ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెదేపా జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇవేమీ పట్టకుండా విదేశాల్లో పర్యటిస్తున్నారని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు.

తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రజలకు ఏ చిన్న కష్టం వచ్చినా అప్పటి ముఖ్యమంత్రి క్షణాల్లో అక్కడికి వెళ్లి పరిస్థితి సమీక్షించి చక్కదిద్దేవారని నేటి పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉందన్నారు. ఇప్పటికైనా పరిస్థితి చక్కదిద్దాలని లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆమె హెచ్చరించారు.

**IN THE HON'BLE COURT OF THE JUDGE : FAMILY COURT AT : VISAKHAPATNAM**
**M.P.3/2018 in F.C.O.P.586/2015**

**Between :**
1. Smt. Pidimi Varalakshmi
2. Pidimi Anjali
(The 2nd petitioner being minor rep. by her
Mother and natural guardian i.e., 1st petitioner
…Petitioners

**And**
Pidimi Veera Raju …Respondent

**NOTICE**

**To,**
**THE RESPONDENT :**
Pidimi Veera Raju, S/o. Late. Veeranna,
Hindu, aged about 30 years, Business,
Residing at Rahayyapeta, Nakkapalli,
Visakhapatnam District.

Please take notice that the above named petitioners filed the above M.P.3/2018 in F.C.O.P.586/2015 petition against you for arrears of monthly maintenance, under Section 128 Criminal Procedure code and the matter stands posted to 05-09-2019 for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **05-09-2019 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

**(By Order of the Hon'ble Court)**

**B.TRINADHA RAO, E.SRINIVASA RAO**
**& B.S.LAKSHMI**
**Advocates,**
**Visakhapatnam**
**Cell : 9440316806**

**IN THE HON'BLE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM**
**I.A.77/2019 in O.S.641/2015**

**Between :**
**Sri. Locherla Ramanaji …Petitioner/Plaintiff**
**And**
**Sri. B.S.R.K.M.M. Tilak (died) & 2 others ...Respondents**

**NOTICE**

**To,**
**Respondent No.1:**
Sri. Bantupalli Aruna, W/o. Late Bantupalli Siva Rama Krishna Madan Mohan Tilak, D/o. Sri. Basuru Damodhara Rao, R/at. Plot No. 446, Lakshmi Sai Nilayam, Visalakshi Nagar, Visakhapatnam.
**Respondent No.2:**
Sri. Bantupalli Sowmya, D/o. Late Bantupalli Siva Rama Krishna Madan Mohan Tilak, R/at. Plot No. 446, Lakshmi Sai Nilayam, Visalakshi Nagar, Visakhapatnam.

Take notice that the above petitioner/plaintiff filed the above petition for bringing you on record in the suit, as defendants 2&3 being the legal heirs of the deceased defendant, and the same is coming up for your notice on **04-09-2019,** therefore you are required to attend before the above Court at **10:30 A.M** either in person or through your counsel, to submit your objections, else the petition will be decided in your absence.

**(By Order of the Hon'ble Court)**

**N. SAI KRISHNA**
**Advocate,**
**Visakhapatnam,**
**Cell:8143261769**

# పోర్టు ప్రైమరీ పాఠశాల అడ్మిషన్ల ప్రక్రియను పునఃప్రారంభించండి



విశాఖపట్నం : ఎన్నో వందల పేద, బడుగు, బలహీన వర్గాల బాలల జీవితాలతో ముడిపడి ఉన్న సాలగ్రామపురం పోర్టుట్రస్టు ప్రైమరీ పాఠశాల్లో ఒకటి, రెండో తరగతి అడ్మిషన్ల ప్రక్రియ యుద్ధప్రాతిపదికన పునఃప్రారంభించేలా జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టాలని ఛైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు శీతారాం కోరారు. సోమవారం జూపార్కు దగ్గరలో గల జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో డిఇఓ లింగేశ్వరరెడ్డిని కలిసి డాక్టర్ గొండు శీతారాం వినతిపత్రం అందజేశారు. ఈ ప్రక్రియపై తాము గత 18 నెలల పోరాటాలపై గుర్తు చేశారు. అనంతరం లేఖను పరిశీలించిన లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఛైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం తన దృష్టికి తీసుకొచ్చిన పోర్టు ప్రైమరీ పాఠశాలల అడ్మిషన్ల ప్రక్రియను తిరిగి పునఃప్రారంభించేలా పోర్టు ట్రస్టు అధికారులు, జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విద్యాశాఖ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సత్వరం చర్యలు చేపడతామన్నారు.

## సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక నూతన కమిటీల ఏర్పాటు

### ఎస్.రాయవరం కన్వీనర్‌గా కడిమి కాసులు

నర్సీపట్నం : సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక జిల్లాలో నూతన కమిటీలు నియామకంలో భాగంగా ఎస్.రాయ వరం మండలం కన్వీనర్‌గా కడిమి కాసులు(కాశీ)ను నియ మిస్తున్నట్లు ప్రచార ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు జక్కు నరసింహ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా నర్సీపట్నంలో నియామకపత్రం అంద జేశారు. జిల్లాలో ఇప్పటికి 14 మండలాల్లో నూతన కమిటీల నియా మకం చేపట్టడం జరిగిందని, ఎస్.రాయవరం మండలంతో 15వ మండలంగా పూర్తయిందని, మిగిలిన మండలాలు ఈ నెల చివరి నాటికి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 30వ తేదీన రాష్ట్ర కమిటీ సమావేశం మంగళగిరిలో ఏర్పాటు చేయడం జరుగు తుందని, ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధ్యక్ష కార్యదర్శులు, కన్వీనర్లు హాజరు కావాలని కోరారు.


జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి నుంచి నియామక పత్రం అందుకుంటున్న కడిమి కాసులు

## అన్నదాతల కోసం పెన్షన్ పథకం అమలు

మాకవరపాలెం : ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం కింద అన్నదాతలకు పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు ఈ నెల 9వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయస్సు గలవారు అర్హులుగా పేర్కొన్నారు. ఈ పథకాన్ని వినియోగించుకోవాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ కాపీలను అందించాల్సి ఉందన్నారు. రెండు హెక్టార్లలోపు విస్తీర్ణం కలిగిన రైతులే ఉండా లన్నారు. భార్య, భర్తలు ఈ పథకంలో చేరేందుకు అవకాశం ఉందని వివరించారు. ప్రీమియం చెల్లించిన రైతులకు 60 సంవత్స రాలు నిండిన తర్వాత రూ.3వేలు అందిస్తారని చెప్పారు. ఒకవేళ అరవై సంవత్సరాలలోపు రైతు మరణిస్తే చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో సహా నామినీకి అందజేస్తారన్నారు. మండలంలోని రైతులు మీ సేవ కేంద్రాల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుల వయస్సు ప్రాతిపాదికన ప్రతీ నెలా రూ.55 నుంచి రూ.200 వరకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హులంతా ఈ పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం



భీమునిపట్నం : భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా నూకరాజు ఆధ్వర్యంలో భీమిలి జోనల్ కమీషనర్ సి.హెచ్. గోవిందరావుకి స్థానికంగా ఉన్న పలు సమస్యలపై సోమవారం స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ భీమునిపట్నం పర్యాటక ప్రాంతం కావడం వలన కార్తీక మాసం, దసరా సెలవులు సమయంలో ఇతర ప్రాంతాలనుండి రోజుకి వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారనీ బట్టలు మార్చు కొనుటకు డ్రెస్సింగ్ రూమ్ లు లేనం దున చాలామంది పర్యాటకులు ఇబ్బంది పడు తుంటారనీ అన్నారు. బీచ్ లో స్థలమును పరిశీలించి డ్రెస్సింగ్ రూమ్ లు కట్ట వలసినదిగా కోరారు. అదేవిధంగా భీమిలి జోన్ 15, 16, 20 మరియు 21వ వార్డులలో సామాజిక మరుగుదొడ్లు ఉన్నాయనీ, అయితే వీటికి నీటి సమస్య ఎక్కువగా ఉందనీ, అలాగే లోపల క్లీనింగ్ కూడా అంతంత మాత్రముగానే ఉంటుందనీ చెప్పారు. వాటిని శుభ్రపరచాలని వినతి పత్రం కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంటపల్లి యోగీశ్వరావు, మారోజు సంజీవ కుమార్, గిడుతూరి శ్రీనివాస రావు, కనకల అప్పలనాయుడు, కంచెర్ల కామేష్, రాజగిరి రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25న విశాఖలో ఓబిసి సాధన సదస్సు

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి



విశాఖపట్నం : ఓబిసి సాధనకై అవిశ్రాంత పోరాటం చేసి ఎలాగైనా సాధించి తీరుతామని ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంఘ నాయకులు శపథం పూనారు. విశాఖపట్నం జిల్లా శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో ప్రేమ సమాజం లో నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిష్టకరణాలకు ప్రత్యేక కార్పొరేషన్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ప్రకటించాలని డిమాండ్ చేసారు. బిసి -డి జాబితాలో వున్న తమకు కేంద్రప్రభుత్వ విద్య ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా ఓబిసిలో చేర్చాలని కోరారు. ఓబీసీ సాధన దిశగా త్వరలో ఆగస్టు 25న రాష్ట్ర శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో భారీ బహిరంగ సదస్సు నిర్వహించి రాష్ట్రం నలుమూలల నుంచి తమ ప్రతినిధులను ఆహ్వానిస్తామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు సన్‌మూర్తి, కోశాధికారి బద్రిమహంతి వెంకటరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదాశివుని కృష్ణ,, జిల్లా అధ్యక్షులు డబ్బీరు సత్యప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్వీ రమణరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎన్.ఎస్.వి ప్రసాద రావు, ఎస్వీ రమణయ్య, బలివాడ అప్పల నర్సయ్య, బలివాడ హరిబాబు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చోడవరంలో ఘనంగా ఫొటో గ్రాఫర్ల దినోత్సవం

### - ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు

### -ఫోటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ అధ్యక్షులు బొంగరాల సురేష్ వినతి


మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడుకు వినతి పత్రం అందచేస్తున్న యూనియన్ నాయకులు

చోడవరం: పట్టణంలోని స్థానిక శ్రీకాంత్ కళ్యాణమండపంలో ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏపి స్టేట్ ఆర్గనైజింగ్ శెక్రటరీ, చోడవరం ఫొటో గ్రాఫర్సు అసోసియేషన్ అధ్యక్షులు బొంగరాల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాల నాయుడు, చోడవరం ఎమ్మెల్యే సోద రుడు జయదేవ్‌తో పాటు యూనియన్ ఏపి స్టేట్ ఛైర్మన్ ఎన్.వి.వి.యస్ ప్రసాద్,కెమేరామెన్ సెట్టింగ్స్ ఫేకెల్టీ శివాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యలను ఎమ్మెల్యే ముత్యాల నాయుడుకు యూనియన్ నాయకులు వివరించారు. మొబైల్ ఫోనులు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి మరింత ఇబ్బందులు పెరిగాయన్నారు. ఫొటో గ్రాఫర్లకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు మంజూరు చేయాలని, ఇతర పథకాలు ఫొటో గ్రాఫర్లకు వర్తించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకువెళ్ళి వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం సి.ఐ.ఈశ్వరరావు,అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాజాన శివ, శెక్రటరీ కుప్పల అప్పలస్వామి, ట్రెజరర్ ఆడారి తులసీరావు, చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

## గైనకాలజిస్టు, ఎనస్టీషియన్ మధ్య సమన్వయ లోపం... ఆస్పత్రిలో ఘోరం...

### ప్రసవానికి వచ్చిన మహిళలకు వైద్యులు చూపిన నరకం



నర్సీపట్నం : ఏరియా ఆసుపత్రిలో ప్రసవం కోసం శనివారం వచ్చిన మహిళలకు సోమవారం ఆపరేషన్ చేషేందుకు డాక్టర్ గౌతమి సన్నాహాలు చేశారు . ఎనస్థీసియన్ సుధాకర్ సోమవారం తనకు అనారోగ్యంగా ఉందంటూ పది రోజులు సెలవు కావాలని సూపర్డెంట్ కు సెలవు ఇచ్చి వెళ్ళిపోయారు. దీంతో గర్భిణీ స్త్రీలు అంతా ఏం చేయాలో పాలు పోక హాహాకారాలు చేశారు. వారి బంధువులు వారు చేసిన ఆర్తనాదాలతో ఆస్పత్రి గొల్లుమంది .విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు ఆస్పత్రికి వెళ్లి సమాచారాన్ని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ కు అందించారు .దీంతో ఎమ్మెల్యే హుటాహుటిన మాకవరపాలెం నుండి ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. విషయాన్ని తెలుసుకున్న ఆయన ముందుగా జిల్లా కోఆర్డినేటర్ నాయక్ తో ఫోన్లో మాట్లాడారు .తర్వాత సూపరిండెంట్ డేవిడ్ మాట్లాడారు. ఫోను గైనకాలజిస్ట్ గౌతమికి ఇచ్చారు. గౌతమి డాక్టర్ నాయక్ ల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ బట్టి ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ గౌతమి, ఎనస్థీ సియన్ సుధాకర్ మధ్య సమన్వయ లోపం ఉందనే విషయం బహి ర్గతం అయింది. దీంతో చేసేదేమీ లేక అనకాపల్లి నుండి అత్యవసరంగా మరొక గైనకాలజిస్టునీ, ఎన స్థీసియన్‌ని ఎమ్మెల్యే నర్సీ పట్నం ఏరియా ఆస్పత్రికి రప్పించారు. వారు వచ్చే వరకు ఎమ్మెల్యే ఆస్పత్రిలోనే వేచి ఉన్నారు. వైద్యులు వచ్చాక వీరికి ప్రసవాలు జరపాలని సూచించి ఆయన వెళ్లారు .దీంతో గర్భిణీ స్త్రీలు వారి బంధువులు ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలియ జేశారు. ఎంతోకాలంగా ఇలా ఏరియా ఆస్పత్రిలో మరొక ఎనస్థీసియన్ పోస్టు ఖాళీగానే ఉంది. దీన్ని భర్తీ చేసే విషయంలో అటు అధికారులు ,ఇటు పాలకులు నిర్లక్ష్యం వహిస్తు న్నారు. సోమవారం జరిగిన సంఘటన కూడా సీనియర్ గైనకాలజిస్ట్ ఉంటేనే ఈ ఆపరేషన్లు జరుగుతాయనే వాదన సుధాకర్



ముందు గానే ఏపివివిపి జిల్లా కో ఆర్డినేటర్ నాయక్ తెలియజేసినట్టు ఫోన్ సంభాషణ భట్టి తెలిసింది .ఒక్క నెలకు సుమారు 450 ప్రశవాలకు సంబంధించి సేవలు అందించడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందనే వాదన వాస్తవం.

సోమవారం ఆరు కేసులు ఒకేసారి ఆపరేషన్ దియేటర్ కి చేయడంతో గైనకాలజిస్ట్ గౌతమి ఎనస్థీసియన్ సుధాకర్ మధ్య సమన్వయ లోపం కి కారణమయింది.

దీంతో చేసేదేమీ లేక ఆయన సెలవు పెట్టి వెళ్ళిపోయారు. ఇప్పు డైనా అధికారులు, పాలకులు స్పందించి నర్సీపట్నంకి మరొక సీనియర్ గైనకాలజిస్ట్ అత్యవసరంగా నియమించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ దిశగా పాలకులు అధికారులు దృష్టి సారించాలని ప్రజలు, గర్భిణి స్త్రీలు హృదయపూర్వకంగా కోరుతున్నారు.

## స్పందన కార్యక్రమానికి

## మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి

### పెద్దాపురం రెవెన్యూ డివిజినల్ అధికారి ఎస్.మల్లిబాబు



పెద్దాపురం : పెద్దాపురం డివిజన్‌లో ప్రతి సోమవారం 12 మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని పెద్దాపురం రెవెన్యూ డివిజినల్ అధికారి ఎస్.మల్లిబాబు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమం అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి 12 మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలకు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. డివిజన్లోని కొన్ని మండలాల్లో మండల స్థాయి అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరు కావడం లేదని నా దృష్టికి వచ్చిందని, ఇకపై మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా స్పందన కార్యక్రమానికి హాజరవ్వాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత శాఖలు హాజరు కాని కారణంగా అర్జీదారులకు సమాచారం ఇవ్వడానికి సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు.సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి డివిజన్ నుండి 18 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు.వీటిలో రేషన్ కార్డు పునరుద్ధరించమని ఒకటి,భూమి రికార్డులో తప్పులు సరిచేయమని ఒకటి,స్థలం విచారణ చేపట్టి ఆక్రమణ తొలగించి న్యాయం చేయమని ఒకటి, ప్రభుత్వ భూమిని సాగు చేసుకోవడానికి ఇప్పించమని ఒకటి,పట్టాదారు పాసు పుస్తకంలో వివరాలు మార్పు చేయమని,భూమి రికార్డుకు సంబంధించి మీసేవలో వివరాలు లభ్యం కావడం లేదని ఒకటి,ప్రజల మధ్య ఏర్పాటు చేసిన సెల్ టవర్ ను తొలగించమని ఒకటి, అలాగే సెల్ టవర్ ఏర్పాటును నిలిపివేయమని ఒకటి,మరణ ధ్రువీకరణ పత్రంలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయమని, ప్రభుత్వం కోరితే ఇళ్ల స్థలాలకు తన భూమిని విక్రయిస్తానని ఒకటి,భూసమస్య పై ఒకటి, ఫించను కొరకు ఒకటి,పంట కాలువను సర్వే చేయించి సాగు నీరు ఇప్పించమని ఒకటి,వేసిన విద్యుత్ స్తంభానికి విద్యుత్ కనెక్షన్ ఇప్పించమని ఒకటి, ఇళ్ల స్థలాలు ఇప్పించమని రెండు, ఇళ్ల స్థలాల వివరాలను ఇప్పించమని ఒకటి,పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించిన ఈఎస్ఐ ఆసుపత్రిలో మందుల కొరత, సరైన సౌకర్యాలు లేవని వీటిపై చర్యలు తీసుకోవాలని ఒకటి అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు.

## స్పందనకు 102 దరఖాస్తులు


స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో గోవిందరావు

నర్సీపట్నం : నర్సీపట్నం ఆర్డీవో కార్యా లయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంకు ప్రజల నుండి 102 ఫిర్యాదులు అందాయని నర్సీపట్నం ఆర్డీవో ఆర్.గోవిందరావు తెలిపారు. ఇటీ వల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిం చిన నవరత్నాలులో భాగంగా నిరు పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీలకు సంబంధించి ఎక్కువ మంది ప్రజలు ఇళ్ల స్థలాలు కొరకు దరఖాస్తులు చేసుకున్నారు. ఇవే కాకుండా భూ సంబంధిత సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లుకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆర్డీవో ఇళ్ల స్థలాల కొరకు దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి తెల్లరేషన్ కార్డు ఉండాలని, అదే ఊర్లో నివసిస్తూ ఉండాలని, గతంలో ప్రభుత్వ స్కీములకు సంబంధించి గృహాలు గానీ, ఇళ్ల స్థలాలు గానీ పొంది ఉండరాదన్నారు. ఇల్లు, స్థలాలు లేని వారికి మాత్రమే ఇళ్ల స్థలాలను ఇవ్వడం జరుగు తుందని స్పష్టం చేశారు. అదే విధంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి గృహాలకు సిబ్బంది వచ్చి విచారణ చేయడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. నక్కపల్లి మండలం ఉపమాక గ్రామానికి చెందిన ఉలిసి లక్ష్మి తన ఫిర్యాదులో తన కుటుంబానికి 2.88 సెంట్ల భూమి ఉందని, దానిలో 20 సెంట్ల భూమిని బయటి వ్యక్తులు ఆక్రమించుకున్నారని, తగు విచారణ చేసి తన భూమి తనకు ఇప్పించాలని కోరారు. మాకవర పాలెం మండలం కొండల అగ్రహారం గ్రామానికి చెందిన గ్రామస్తులు ఫిర్యాదులో సర్వేనెంబర్ 114/6 లో 1.69 సెంట్ల జిరాయితీ భూమిలో నివసిస్తున్నామని, గ్రామకంఠం గాని, పోరంబోకు భూమి గాని, ప్రభుత్వ అసైన్డ్ భూమి కానేకాదని కాబట్టి సంబంధిత భూమికి పట్టాలు ఇవ్వాల్సిందిగా కోరారు. నాతవరం మండలం జిల్లేడుపూడి గ్రామానికి చెందిన కిల్లాడ శ్రీరామ్ మూర్తి తన ఫిర్యాదులో సర్వే నంబర్ 61-2ఎలో 0.11 సెంట్ల భూమిలో 50 సంవత్సరాల నుండి నివసిస్తున్న మని సంబంధిత భూమిని ఆన్లైన్లో 1 బి తప్పుడు అడంగల్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించారని, సదరు పాస్ పుస్తకాలను రద్దు చేయాలని కోరారు. నాతవరం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన గ్రామ ప్రజలు తమ ఫిర్యాదులో తాండవ జంక్షన్ నుండి ఊరు వైపు వెళ్లే రహదారిలో కొంతమంది ఆక్రమించి పాకలు వేశారని, అందువలన రహదారిపై రాకపోకలకు అంతరాయం కలుగుతుందని తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. నర్సీపట్నం మండలం గురందొరపాలెం గ్రామానికి చెందిన రుతల అప్పారావు తన ఫిర్యాదులో సర్వేనెంబర్ 211 - 7లో 1.05 సెంట్ల భూమికి కొంతమంది ఆక్రమణదారులు తప్పుడు పత్రాలు సృష్టిం చారని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో స్పందనకు గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేంద్ర ప్రసాద్, డివిజనల్ పంచాయతీ అధికారి శిరీషారాణి, సిడిపిఒ జివి.రమణి, డివిజనల్ స్థాయి అధికారులు హాజరయ్యారు.

## ఉచితంగా దుస్తుల పంపిణీ



వీరఘట్టం : శ్రీకాకుళం గుర జాడ విద్యా సంస్థల అధినేత జీవీ స్వామినాయుడు వీరఘట్టం మండలంలోని తన స్వగ్రామమైన చిట్టపులివలస లో ఉచితంగా వస్త్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ప్రతి కుటుం బానికి రూ.1000 విలువ చేసే చీర, ధోవతి, తువ్వాలు ఉన్న ప్యాకెట్ లను అందజేశారు. శ్రీకాకుళం నుంచి ప్రత్యేక వాహనంలో 253 ప్యాకెట్లను గ్రామానికి పంపించారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు వీటిని ఇంటింటికి తీసుకువెళ్లి పంపిణీ చేశారు. స్వామినాయుడు తల్లి గౌరమ్మ, తండ్రి జగ్గునాయుడు జ్ఞాపకార్థం ఈ కార్య క్రమం చేపట్టారు. ఇందు కోసం సుమారు రూ.2.50 లక్షలు వెచ్చించారు.

# సీనియర్ ఫోటోగ్రాఫర్ రమణకు సన్మానం

## - 49 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం



విశాఖపట్నం: ప్రపంచ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరానికి చెందిన ఛాయాగ్రహకుడు దాదాపు నలభై తొమ్మిది సంవత్సరాల అనుభవం ఉన్న పొట్నూరు వెంకట రమణ గారిని సోషల్ మీడియా అధ్యక్షులు సన్ మూర్తి సన్మానించారు. సీనియర్ ఫోటోగ్రాఫర్గా తాను ఈ రంగంలో అనేక మైలురాళ్లను గుర్తించానని గతంలో కెమెరా మోడల్ మారడానికి కనీసం 5 నుంచి 10 సంవత్సరాల సమయం పట్టేదని ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతినిత్యం ఒక కొత్త మోడల్ వస్తుందని అన్నారు. ఒక కెమెరా కొనుగోలు చేసిన తర్వాత దాదాపు పది సంవత్సరాలు దాన్ని ఉపయోగించే వారిని ఇప్పుడు లక్షల రూపాయలుతో కొనుగోలు చేసిన కెమెరాలు వచ్చే ఏడాదికి పనిచేయడం లేదని ఈ సందర్భంగా వాపోయారు. సెల్ ఫోన్ వినియోగం వల్ల కెమెరామెన్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రతిఒక్కరు తమ సెల్ ఫోనెతో చిత్రాలు తీసుకొని వృత్తికి నష్టం కలుగుతోందని అన్నారు. ఐతే కెమెరాతో తీసిన చిత్రాలకు ఆదరణ ఉంటుందని, ఛాయాగ్రాహకుడు చిత్రీకరించిన చిత్రాలకు సెల్ ఫోన్ చిత్రాలకు వ్యత్యాసం ఉంటుందని సన్ మూర్తి తెలిపారు. ఫోటోగ్రఫీని వృత్తిగా స్వీకరించిన వారికి తగిన చేయూత నిచే రీతిలో కార్యక్రమాలు జారిగేటప్పుడు ఫోటో కళాకారులను ప్రోత్సహించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు ఎం. తిలక్ పట్నాయక్, ప్రసాదు, సిద్ధార్ధ తదితరులు పాల్గొన్నారు.






# ప్రపంచ ఫొటో దినోత్సవం

భీమునిపట్నం: 14వ వార్డు, జీ వి యం సి ప్రాథమిక పాఠశాల,రాయప్పాలెం ప్రధానోపాధ్యాయుడు రెడ్డి పల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటో దినోత్సవం మరియు మానవత్వపు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానవీయతా విలువలు మరియు నైతిక ప్రమాణాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తి మానవత్వం కలిగి ఉండాలనీ తోటి మనిషి పట్ల ప్రేమ, దయ,కరుణ కలిగి ఉండాలనీ విద్యార్థులకు తెలుపుతూ ఫొటోగ్రఫీ అనేది ఒక కళ అని బాగా కష్టపడితే నేర్చుకోవడం చాలా సులభమని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఛాత్రోపాధ్యాయులు రోష్ని ,దీపిక రేవతి, యమున మరియు సాహితి తదితరులు పాల్గొన్నారు.

# స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## కంచరపాలెం సి.ఐ కృష్ణారావు



కంచరపాలెం: పిర్యాదు దారుల సమస్యల సత్వర పరిష్కారం గురించి నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంచరపాలెం సి.ఐ కృష్ణరావు తెలిపారు. ఈమేరకు కంచరపాలెం పోలీస్ స్టేషన్ లో సోమవారం ఉదయం స్పందన కార్యక్రమం లో పాల్గున్న ఆయన పలువురి వద్ద పిర్యాదులు స్వికరించారు.

పిర్యాదు దారుల సమస్యలను నేరుగా పరిశీలించి సమస్యను త్వరిత గతిన పరిష్కరించాలని ఎస్ .ఐ లను అదేశించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా తనదృష్టికి తీసుకురావాలి సూచించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో అర్జీలు తీసుకున్న వెంటనే వారికి సీసీటీఎన్ఎస్ ద్వారా రిసిప్టులు అందజేశారు. ఎప్పటిలోగా సమస్య పరిష్కారిస్తాం. తర్వాత ఎవర్ని సంప్రదించాలనే అంశం అందులో ఉంటుందని ఫిర్యాదుదారుల సెల్‌ఫోన్ నెంబర్‌లు కూడా స్వీకరించి కంట్రోల్ రూం, డయల్ 100 సిబ్బంది ద్వారా సంబంధిత అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం అయిందా.. లేదా అనే అంశంపై ఆరా తీయడం జరుగుతుందన్నారు . కార్యక్రమంలో ఎస్ .ఐ అప్పలనాయుడు సిబ్బంది పాల్గున్నారు

# ర్యాగింగ్‌పై అవగాహన




భీమునిపట్నం: తగరపువలస అవంతీ కళాశాలలో ఆంటీ ర్యాగింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కమిషనర్ ఆర్ రవి శంకర్ రెడ్డి హాజరై విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని అదేవిధంగా జూనియర్స్ పట్ల ప్రేమానురాగాలతో ఉండాలని, స్నేహభావంతో మెలగాలని అలాగే ర్యాగింగ్ చర్యలకు దూరంగా ఉండాలని ఏ విధమైన హద్దులు దాటిన శిక్షార్హులు అవుతారని తెలిపారు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ వి ఎం గణేష్ మాట్లాడుతూ విద్యార్థులు రోజు రోజుకి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి అని జూనియర్స్ పట్ల స్నేహ భావంతో మెలగాలని శ్రద్ధతో చద వాలాని అన్నారు.

# ఘనంగా లక్ష్మీగణపతి హోమం



అమలాపురం,: వై.ఎస్.ఆర్.సి.పి నాయకులు వంటెద్దు వెంకయ్యనాయుడు వంటెద్దువారి వీధిలోని తన స్వగృహంలో సోమవారం శ్రీలక్ష్మీ గణపతి హోమం,చండీ యాగం నిర్వహించారు.ఈకార్యక్రమానికి సంఘిక సంక్షేమ శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ సతీసమేతంగా హజరైనారు.అనంతరం ప్రసాదవితరణ జరిగింది. మంత్రి విశ్వరూప్‌తోపాటు ఆల్డచైర్మన్ యాళ్ల దొరబాబు,పట్టణ వై.ఎస్.ఆర్.సి.పి అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర,మాజీ మున్సిపల్ ప్రతిపక్షనాయకులు చెల్లుబోయిన శ్రీను,ఐ.వి.సత్యనారాయణ,కల్వకొలను తాతాజీ,మాజీ సోంబాబు,పంపన పద్మలత,పెయ్యాల సంధ్య,మోల్లేటి కనకదుర్గ,కొల్లాటి దుర్గాబాయి,ఉండ్రు వెంకటేష్,ఆకుల బాలాజీ,గునిశెట్టి రమణలాల్,మద్దింశెట్టి ప్రసాద్,గునిశెట్టి రోహిణి,తదితరులు పాల్గొన్నారు.

## నేటినుండి ఉచిత డయాబెటిస్ వైద్య శిబిరం

అమలాపురం,: ఈనెల 20,21తేదిలలో ఉచిత డయాబెటిస్ వైద్య శిబిరం నిర్వహించబడునని కిమ్స్ సంస్థ యం.డి కె రవివర్మ తెలిపారు. అమలాపురం పట్టణంలోని సుబ్రహ్మమణ్యేశ్వరస్వామి గుడి సమిపంలోని కిమ్స్ సూపర్‌స్పెషాలిటి క్లినక్ లో ఈకార్యక్రమం జరుగునన్నారు.కోనసీమ ప్రాంతంలో మునుపెన్నడు లేని విధంగా నిత్య సుగర్‌బ్యాది నిపునులు అందుబాటులో కిమ్స్ సూపర్‌స్పెషాలిటి ఆశుపత్రి ఈసదుపాయం కలిపించిందన్నారు.ఈక్యాంపు నందు డయాబెటిస్ వ్యాది సంబందిత,ప్రాదమిక రక్తపరిక్షలు మరియూ డాక్టర్‌చే సంప్రదింపు అవసరం కలిడిన వారికి ఈ.సి.జి,మరియూ ఆదునిక రక్తపరిక్షలు(లిపిడ్‌ప్రొపైల్,దైరాయిడ్ ప్రొపైడ్ పేకేజి రూపంలో లభించునని తలెలిపారు. ఈఉచిత డయాబెటిస్ క్యాంప్ నందు డాక్టర్‌చే సంప్రదింపుతోపాటు న్యూట్రీషన్‌నిస్టుచే ఆహారపద్దతులు,మరియూ జాగ్రత్తలు గుర్చి సూచనలు తెలుపపడునని అన్నారు. ఈసదావాకాసాన్ని వినియోగించు కోవలసిందిగా రవివర్మ కోరారు.

# వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



కాకినాడ: మాధవనగర్ వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు మానికి రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్పవరం సమీపంలోగల జనచైతన్య అవుట్ శ్రీ ఆంజనేయ స్వామి గుడి ప్రాంగణంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసారు.ఈ వైద్యశిబిరానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ప్రముఖ హోమియో వైద్యులు డా.సలాది సూర్యకిరణ్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ఎక్కువగా డెంగ్యూ వ్యాధికి గురి అవుతున్నారన్నారు.దీని నివారణకు పరిశరాల పరిశుభ్రంగా ఉంచుకోవడం,కాచి చర్లార్చిన నీరు త్రాగాలన్నారు. చెవి ,ముక్కు,గొంతు వైద్యులు డా.బి.లక్ష్మణ్ ప్రసాద్ ,ప్రముఖ ఆయుర్వేద వైద్యులు సంగుట్వన్( నిర్మలా ఆయుర్వేదం) సీజనల్ వ్యాధులు జాగ్రత్తలు వివరించారు.సుమారు 5వంత మందికి బిపి,షుగర్,పరీక్షలు చేసి మందులు అందజేసారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ అడబాల రత్న ప్రసాద్, తురగా సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

# వై.కా.పా పట్టణ యువజన అధ్యక్షుడు పుట్టిన రోజు వేడుకలు



భీమునిపట్నం: భీమిలి వై కా పా పట్టణ యువజన అధ్యక్షుడు బింగి హరి కిరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు భీమిలి అవంతి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. అవంతీ ప్రతినిది ముత్తంశెట్టి. మహేష్ కిరణ్ రెడ్డి తో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో పట్టణ ప్రధాన కార్యదర్శి జీరు.వెంకటరెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు జీరు. సుజాత,చిల్ల ప్రమీల,పందిరి విజయ్, గుండాసి మధు నాయుడు, సీనియర్ నాయకులు జీ.వి.రమణ, మైలపిల్లి షణ్ముఖరావు , తమ్మిన రాము,, తదితరులు పాల్గొన్నారు.

# పల్లెబాటలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



మాకవరపాలెం: పల్లెబాటలో గ్రామాల వెళు న్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు ఘన స్వాగతం లభిస్తోంది. సోమవారం మండలంలోని మల్లవరం గ్రామాలను ఆయన సందర్శించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు .అనంతరం వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు.

బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వాలంటీర్లు వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత అవుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు గ్రామ పార్టీ నాయకులు వలంటీర్లు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# స్పందనలో టీచర్స్ కోసం 55వవార్డు అద్యక్షులు బట్టు అదికారికి వినతి



పరవాడ:విశాఖ కలెక్టర్ ఆఫీస్ లో సోమవారము స్పందన కార్యక్రమంలో బాగంగా ఇస్లాంపేట జిల్లా పరిషత్ హై స్కూల్ లో టీచర్స్ కోసం అధికారిని 55వార్డు అధ్యక్షులు బట్టు సన్యాసిరావు కలిసి వినతిపత్రం అందజేసారు. ఈకార్యక్రమంలోవైనార్టీ ప్రెసిడెంట్ దావూద్, యూత్ వైస్ ప్రెసిడెంట్ పిట్ట వెంకట రెడ్డి, పిట్ట పైడి రెడ్డీ తథితర్లు పోల్గోన్నారు.

# విద్యార్థిని విద్యార్థులకు టైలు, బెల్టులు పంపిణి



భీమునిపట్నం: తగరపువలస బంగ్లామెట్ట ఒకటవ వార్డ్ ప్రాదమిక పాటసాల లో టీచర్స్ హెల్ప్ గ్రూప్ ఆద్వర్యం లో 87 మంది విద్యార్థిని విద్యార్థులకు టైలు, బెల్ట్‌లు పంపిణి చేశారు. అలాగే చప్పా అమర్ నాద్ ఆర్ధికసహాయం తో అతని కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు పలకలు, అట్టలు,పెన్సిల్ లు అందజేసారు.

స్కూల్ కాప్లెక్స్ చైర్మన్ చెట్టి సింహాచలం మాట్లాడుతూ టీచర్స్ హెల్ప్ గ్రూప్ ద్వారా పుట్టిన రోజు దినోత్సవం నాడు ఇవ్వడం మంచి పరిణామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీచర్స్ హెల్ప్ గ్రూప్ గౌరవ అద్యక్షులు కె.ముత్యాలరావు,స్వచ్ఛంద ఉపాధ్యాయులు వై,వి రవికుమార్, ఎస్.ఎం.సి.చైర్మన్ పిల్లా.సుజాత, ఉపాధ్యాయులు రమేష్, వాసుపల్లి.లావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వివిధ పంటలపై రైతులకు అవగాహన



గొలుగొండ: వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తలు, ఆత్మ సిబ్బంది సోమవారం గొలుగొండ మండలం లింగంపేట గ్రామంలో రైతులకు వివిధ పంటలపై అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.చంద్రాయుడు, ఏరువాక కేంద్రం డాక్టర్ పి.ప్రదీప్‌లు గ్రామంలో పత్తి, మిరప, టమాటా, జీడిమామిడి, పొగాకు పంటలను పరిశీలించి ఈ పంటల్లో వచ్చే పురుగు, తెగుళ్లను గమనించి వాటి నివారణకు పలు సూచనలు అందజేశారు. ముఖ్యంగా పత్తిలో వచ్చే కొమ్మ తొలుచు పురుగు నివారణకు కార్బఫ్యూకాన్ 10 కేజీల గళికలను ఎకరానికి చెట్టు మొదలు దగ్గర వేయడం వలన పురుగును అరికట్టవచ్చు నన్నారు. మిరప పంటలో వచ్చే కింది ముడత, పై ముడత ఎక్కువగా ఉన్నాయని, పేను, ఎర్రనల్లి కారణంగా మిరపను ఆశించి పంట నష్టానికి గురి అవుతుందని, దీని నివారణకు కెరాథీన్ 3గ్రాములు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. టమాటాలో వైరస్ తెగులు వ్యాప్తి చెందుతుందని, దీని నివారణకు హెక్సాకొనజోల్ 2ఎంఎల్‌ను ఒక లీటరు నీరు, స్పైనోపాడ్ 0.3 గ్రాముల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా పత్తి, మిరప, టమాటాకు ఎరపంటగా బంతి పంటను వేసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.మధుసూధన రావు, ఆత్మ బిటిఎం సిహెచ్.లక్ష్మికిశోర్, సిబ్బంది రాజేశ్వరి, గీత, ఎఇఒ రాజు, ఎంపిఇఒ రైతులు పాల్గొన్నారు.

# నేటి నుండి సి.యం కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ



శ్రీకాకుళం : ముఖ్య మంత్రి కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంటుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సి.యం కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంటును నిర్వహిస్తున్న శ్రీకాకుళంలోని ఎన్.టి.ఆర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంను సోమ వారం జిల్లా కలెక్టర్ జె నివాస్, రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి నారాయణరాజుతో కలసి పరిశీలించారు. కోర్టుల వద్ద ఏర్పాటు చేయాల్సిన బారికేడింగులు, సీటింగు ఏర్పాట్లు, ఇతర సదుపాయాలను గూర్చి ఆదేశాలు జారీ చేసారు. ఎక్కడా ఎటువంటి లోపం లేకుండా ఏర్పాట్లు జరగాలని ఆయన ఆదేశించారు. ఈ నెల 20, 21,22 తేదీల్లో మూడు రోజులపాటు శ్రీకాకుళంలో క్రీడా పండగ వాతావరణం ఉంటుందని మంత్రి అన్నారు. 13 జిల్లాలకు చెందిన పురుష, మహిళా వాలీబాల్ టీమ్ లు, సంబంధిత అధికారులు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

మంగళవారం ఉదయం 10 గంటలకు టోర్నమెంటు ప్రారంభోత్సవం ఉంటుందని, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి మరియు దేవదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొంటారని మంత్రి చెప్పారు. రూ.2 కోట్లతో శాంతి నగర్ లో నిర్మించి ఇండోర్ స్టేడియంను కూడా మంగళవారం ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి నారాయణరాజు చేరుకుని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. సి.యం కప్ టోర్నమెంట్లలో మొట్టమొదటి టోర్నమెంటు వాలీబాల్ అని, ఇది జిల్లాలో ప్రారంభం కావడం సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని టోర్నమెంటును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి నారాయణరాజు మాట్లాడుతూ శ్రీకాకుళంలో వాలీబాల్ టోర్నమెంటుకు టీమ్ లు వస్తున్నాయన్నారు. మొట్టమొదటి టోర్నమెంటు ఇక్కడ ప్రారంభం అవుతుందని చెప్పారు.

చీఫ్ కోచ్ బి.శ్రీనివాస రావు వాలీబాల్ టోర్నమెంటు ఏర్పాట్లను వివరించారు. వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని, వర్షం కురిసే పరిస్థితి ఉంటే శాంతి నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించుటకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసామన్నారు. రాత్రి మ్యాచ్ లు నిర్వహణకు ఏర్పాట్లు చేసామని చెప్పారు.

మహిళా క్రీడాకారిణులకు డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలోను, పురుష క్రీడాకారులకు వెంటేశ్వర ఇంజనీరింగు కళాశాలలోను వసతి ఏర్పాట్లు చేసామన్నారు. అధికారులు, కోచ్ లకు పట్టణంలో అతిధి గృహాలు, హోటల్స్ లో ఏర్పాటు చేసామని చెప్పారు. అధికారులు, క్రీడాకారుల ఆహార పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

సోమ వారం సాయంత్రం నుండి టీమ్ లు రావడం ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. టోర్నమెంటు జరుగుతున్న సమయంలో క్రీడాకారులు విశ్రాంతి తీసుకొనుటకు వై.యస్.ఆర్ కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేసామని వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి పి.సుందర రావు, నగరపాలక సంస్థ ఇన్ ఛార్జ్ కమీషనర్ దేవ కుమార్, సెట్ శ్రీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.వి.ఆర్.ఎస్.మూర్తి, ఇపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీరు ఎన్.రమేష్, డివిజనల్ ఇంజనీరు చలపతి రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎం.చెంచయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, వాలీబాల్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థుల ఫోటోగ్రఫీ నైపుణ్యాలకు అద్దం పట్టేలా గీతం స్టూడియో విద్యార్థి విభాగం సభ్యులు తమ కెమెరాలలో బందించిన ఛాయాచిత్రాలకు ప్రదర్శనను సోమవారం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు.

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా ఏర్పాటైన ఈ ఛాయాచిత్ర ప్రదర్శనలో విశాఖతో సహ దేశంలోని వివిధ ప్రాంతాలలో విద్యార్థులు తాము తీసిన ఫోటోలను ఉంచారు. ప్రతి ఫోటో చక్కటి పెయింటింగ్ లా ఉందని విద్యార్థుల భావుకత వాటిలో కనిపిస్తోందని వైస్ ఛాన్సలర్ ప్రశంసించారు. విద్యార్థి వ్యవహారాల డైరక్టర్ ప్రొఫెసర్ కె.వీరభద్రం మాట్లాడుతూ జి-స్టూడియో పేరిట విద్యార్థులు ఫోటో గ్రఫీలో తమ సత్తాను చాటుతున్నారని, పలువురు విద్యార్థులు ఫోటోగ్రఫీని కెరీర్‌గా ఎంచుకుని చిత్రరంగంలో స్థిరపడ్డారని తెలిపారు. నగరపాలక సంస్థకు స్వచ్ఛ భారత్‌పై లఘు చిత్రాలను రూపొందించి ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.ఎలిజిబెత్ రాణి, ప్రొఫెసర్ గౌతమ్‌రావు, జి-స్టూడియో విద్యార్థి ప్రతినిధులు డి.శ్రీనిష్, అర్భాజ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# 51ఏళ్ల క్రితం గల్లంతైన విమాన శకలాలు లభ్యం



దిల్లీ: ఐదు దశాబ్దాల క్రితం గల్లంతైన ఓ భారత వాయుసేన విమాన శకలాలు తాజాగా లభ్యమయ్యాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహుల్ - స్పితి జిల్లాలో గల ఢాకా గ్లేషియర్‌లో ఏఎన్-12 బీఎల్-534 విమాన శకలాలను అధికారులు గుర్తించారు.

1968 ఫిబ్రవరి 7న 98 మంది రక్షణశాఖ సిబ్బందితో ప్రయాణిస్తున్న ఈ విమానం హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహ్తంగ్ పాస్ మీదుగా వెళ్తుండగా గల్లంతైంది. చండీగఢ్ నుంచి ఈ విమానం లేహ్ ఎయిర్‌పోర్టుకు బయల్దేరింది. అయితే మరికొద్ది నిమిషాల్లో ల్యాండ్ అవుతుందనగా వాతావరణం అనుకూలించకపోవడంతో విమానాన్ని వెనక్కి మళ్లించాలని గ్రౌండ్ కంట్రోల్ సిబ్బంది పైలట్‌కు సమాచారమిచ్చారు. దీంతో పైలట్ విమానాన్ని తిరిగి చండీగఢ్‌కు మళ్లించారు. అయితే మార్గమధ్యంలో రోహ్తంగ్ పాస్ మీదుగా ప్రయాణిస్తుండగా ఈ విమానానికి కంట్రోల్ రూంతో సంబంధాలు తెగిపోయాయి.

ఆ తర్వాత కొన్ని నెలల పాటు విమానం కోసం రక్షణ శాఖ విస్తృత గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ విమానంలో ప్రయాణించిన సిపాయ్ బేలీరామ్ మృతదేహాన్ని 2003లో హిమాలయన్ మౌంటనేరింగ్ ఇనిస్టిట్యూట్ సభ్యులు గుర్తించారు. దీంతో మళ్లీ గాలింపు చేపట్టగా మరిన్ని మృతదేహాలను గుర్తించారు. 2009 నుంచి ఈ గాలింపు చర్యలను నిలిపివేశారు.

అయితే గతేడాది జులైలో విమానానికి సంబంధించిన కొన్ని శకలాలు ఢాకా గ్లేషియర్‌లో పడినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా మరోసారి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఆదివారం విమానానికి సంబంధించిన ప్రధాన భాగాలు లభ్యమయ్యాయి. ఏరో ఇంజిన్, ఎలక్ట్రిక్ సర్క్యూట్స్, ఇంధన ట్యాంక్ యూనిట్, ఎయిర్‌బ్రేక్ అసెంబ్లీ, కాక్‌పిట్ డోర్ తదితర భాగాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

ఎయిర్‌ఫోర్స్ చరిత్రలో జరిగిన అత్యంత ఘోర విమాన ప్రమాదాల్లో దీన్ని ఒకటిగా చెబుతారు.

## నేడు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి రాక

శ్రీకాకుళం : రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు మరియు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు నేడు జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ జె.నివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. మంగళవారం ఉదయం 5.48 గం.లకు శ్రీకాకుళం ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకుంటారు. అనంతరం స్థానిక ఏడురోడ్ల కూడలి వద్ద గల యన్.టి.ఆర్.ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే సిఎం కప్ వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభిస్తారు. తదుపరి స్థానికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొనే ఆయన రాత్రి 7.02 గం.లకు విజయవాడకు బయలుదేరి వెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు

**— వెస్ట్ జోన్ ఎసిపి జి.స్వరూప —**



విశాఖపట్నం : పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వెస్ట్ జోన్ ఎసిపి జి. స్వరూప అన్నారు . ఈ మేరకు సోమవారం వెస్ట్ జోన్ ఎసిపి కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించిన ఆమె పలువురి వద్ద ఫిర్యాదులు స్వీకరించారు.

ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఆమె త్వరిత గతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు . ఈసందర్భంగా ఆమె మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ ప్రయాగాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని, స్పందన కార్యక్రమంలో సకాలంలో ఫిర్యాదుదారుని సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత స్టేషన్ సి.ఐ , ఎస్ .ఐ లకు మెమోలు జారీచేస్తామని హెచ్చరించారు.

అలాగే స్పందన కార్యక్రమంలో అర్జీలు తీసుకున్న వెంటనే వారికి సీసీటీఎన్ఎస్ ద్వారా రశీదులు అందజేస్తున్నామన్నారు .

ఎప్పటిలోగా సమస్య పరిష్కారిస్తాం? తర్వాత ఎవర్ని సంప్రదించాలి? అనే అంశం అందులో ఉంటుందని, ఫిర్యాదుదారుల సెల్‌ఫోన్ నెంబర్‌లు కూడా స్వీకరించి కంట్రోల్ రూం, డయల్ 100 సిబ్బంది ద్వారా సంబంధిత అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం అయిందా.. లేదా అనే అంశంపై ఆరా తీయడం జరుగుతుందని అన్నారు . ప్రజలు స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఈసందర్భంగా ఆమె కోరారు .

## కేఏ పాల్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ !

మహబూబ్‌నగర్: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. తన సోదరుడు డేవిడ్ రాజు హత్య కేసులో కేఏ పాల్ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు విచారణకు మిగతా నిందితులు న్యాయస్థానానికి హాజరైనప్పటికీ కేఏ పాల్ హాజరుకాలేదు. దీంతో మహబూబ్‌నగర్ న్యాయస్థానం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వరద తగ్గుముఖం పడుతోంది

## : మంత్రి మోపిదేవి



విజయవాడ : రాష్ట్రంలో వర్షాలు కుదుటపడటంతో వరద తగ్గుముఖం పడుతోందని పశుసంవర్ధకశాఖ మంత్రి మోపీదేవి వెంకటరమణ పేర్కొన్నారు. భారీగా కురిసిన వర్షాలతో వరద ముంపుకు గురైన లంక గ్రామాల్లో మంత్రి మూడు రోజులుగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఆ సందర్భంగా ముంపు ప్రాంతాల్లోని సమస్యలపై ఆయన దృష్టి సారించారు. వరద ప్రాంతాల్లోని తాగునీరు, విద్యుత్ పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రజల అవసరాలను తీరుస్తూ, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఎన్నడులేని విధంగా సహాయ చర్యలు చేపట్టామని, టీడీపీ నేతలు అనవసరంగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పర్యటనకు వెళ్లిన సమయంలో వరద ముంపుకు గురైన వారిని తాము మినరల్ వాటర్ అడిగినట్లు ఒక ఛానల్లో ప్రసారం అయ్యిందని, దానిలో మాట్లాడిన వ్యక్తి ఎవరిని విచారిస్తే అతను తెలుగుదేశం కార్యకర్త అని తెలిసిందన్నారు. అయితే వరద ముంపుకు గురై ఇబ్బంది పడుతున్న వారిని మినరల్ వాటర్ అడిగే దిక్కు మాలిన ఆలోచనలు తమకు లేవని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వరదల్లో బురద రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

ఆ చానల్ ప్రసారం చేసిన వార్తల్లో వాస్తవం లేదని కొట్టి పారేశారు.

# ప్రణయ్, ప్రణీత్ ముందంజ...



బాసెల్ (స్విట్జర్లాండ్): బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో తొలి రోజు పోటీల్లో భారత షట్లర్లకు మంచి ఫలితాలే లభించాయి. పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్, హెచ్ఎస్ ప్రణయ్ రెండో రౌండ్‌కు అర్హత సాధించారు. 19వ ర్యాంకు ఆటగాడైన ప్రణీత్ 21-17, 21-16 తేడాతో కెనడా క్రీడాకారుడు ఆంథోనీ హో షు (66వ ర్యాంకు)ను వరుస గేముల్లో చిత్తు చేశాడు. మరో షట్లర్ ప్రణయ్ గెలుపు కోసం పోరాడాల్సి వచ్చింది. ఫిన్లాండ్‌కు చెందిన యూటు హీనోపై 17-21, 21-10, 21-11 తేడాతో విజయం సాధించాడు. తొలి గేమ్ చేజార్చుకున్న అతడు ఆ తర్వాత చెలరేగి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

# వేస్ట్ ప్లాస్టిక్ బాటిల్స్ క్రషింగ్ మిషన్ ప్రారంభం

## ప్రారంభించిన మంత్రి మల్లాడి



యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో ఓఎన్‌జిసి చమురు సంస్థ అందించిన సహకారంతో ఏర్పాటు చేసిన వేస్ట్ ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ మిషన్‌ను పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు, పరిపాలన అధికారి శివరాజ్ మీనా ప్రారంభించారు. స్థానిక ఓల్డేజ్ హోమ్ ప్రాంగణంలో దీనిని ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ ఓఎన్‌జిసి చమురు సంస్థ సహాయ సహకారాలతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నామని అన్నారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించడంపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం 3 బాటిళ్లు తెచ్చిన వ్యక్తికి పేటీఎం ద్వారా 15 రూపాయల నగదు బదిలీ చేయనున్నామని అన్నారు ఒక ఫోన్ నెంబర్ రోజులో ఒక్కసారి మాత్రమే ఈ పేటియం నగదు బదిలీ జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గౌరి సరోజ ,ఎ ఇ రాము, గిడ్ల ఎడ్ల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com